## ఎరువుల కొరత లేదు

**విశాలాంధ్ర -పోలవరం :** పోలవరం మండలంలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబి భాష సూచించారు. గురువారం పోలవరం మండలంలోని నాలుగు సహకార సొసైటీల సెక్రటరీలతో ఎరువుల సరఫరా, నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అభి భాషా మాట్లాడుతూ, ఎరువులను బస్తా మీద రేటు కంటే అధిక ధరలకు అమ్మినట్లయితే సంబంధిత షాపులు, డీలర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అవసరానికి మించి ఎరువులు వినియోగించకూడదని, నిల్వ వేసుకునే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కోట రామచంద్రపురం పి జి బుజ్జిబాబు, మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు, సొసైటీ సెక్రటరీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# విశాలాంధ్ర
# ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

## వణికిస్తున్న చలి

**విశాలాంధ్ర - వేలేరుపాడు :** గ్రామీణ ప్రాంతాలలో చలి వణికిస్తున్నది. ఉదయం 9 గంటల వరకు జోరు మంచు కురుస్తోంది. వాతావరణంలో వచ్చిన చల్లదనంతో ప్రజలు ఎక్కువ సమయం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. అటవీ సమీపాన గోదావరి పరివాహక ప్రాంతాలైన కోయిదా, కట్కూర్, నార్లవరం, తిర్లాపురం రేపాకగొమ్ము తదితర పంచాయతీలలోని గ్రామాల్లో చలి అధికంగా ఉంది. సాయంత్రం కూడా 5 గంటల నుండే చలి మొదలవుతుంది. ఉదయాన్నే విధులకు వెళ్లే వారికి, విద్యార్థులకు, ప్రయాణికులకు చలి ఒకింత ఇబ్బందిని కలిగిస్తున్నది.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

- జీవో నెం 590, 107, 108 రద్దు చేయాలి :

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్

**విశాలాంధ్ర - ఏలూరు :** పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, జీవో నెంబర్ 590,107,108 లను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో డి.ఎం.అండ్ హెచ్.ఓ కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వైద్య కళాశాలల్లో ప్రైవేటీకరణ ఆపాలని, కూటమి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆగేంత వరకు పోరాడుతామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని ప్రారంభిస్తే నేడు కూటమి ప్రభుత్వం అందులో పది ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణను సమర్థిస్తూ చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే వైద్య కళాశాలలు తక్షణం నిర్మాణం జరుగుతాయని, మెడికల్ సీట్లు అందరికీ అందుబాటులోకి వస్తాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నిధులు కొరత వలన మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల పదహారువేల కోట్ల రూపాయలు అప్పు చేసిందని ఆ సొమ్ము దేనికి ఖర్చు పెట్టారో ప్రజలకు తెలియజేయాలని ప్రశ్నించారు. యువతరం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ గత ప్రభుత్వం చేసిన తప్పుడు జీవోలను రద్దు చేస్తామని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రజలందరికీ సంక్షేమాన్ని మరింతగా అమలు చేస్తామని హామీలు ఇచ్చి 18 నెలలు గడుస్తున్నా ఆ హామీల అమలుకు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించు కోవాలని లేని పక్షంలో భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పు లూరి హేమశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ పిపిపి విధానాన్ని తీసుకురావడం వలన ఆంధ్ర రాష్ట్రంలోని అల్పాదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేయడం వలన దీనికి అనుసంధానంగా ఏర్పడే బోధన ఆసుపత్రులలో ప్రజలకు అందించే ఉచిత వైద్య సేవలు కూడా దక్కవని తెలిపారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రైవేటు వారికి దారాదత్తం చేయాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రైవేటీకరణను నిలుపు చేయడానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వర ప్రసాద్,అడ్డగర్ల లక్ష్మిఇందిర, కార్యవర్గసభ్యులు కొండేటి బేబి, మావూరి విజయ,కొల్లూరి సుధారాణి, కొండేటి రాంబాబు,గొర్లి స్వాతి,బళ్ల కనక దుర్గా రావు,ఎంఎ హకీమ్, భజంత్రీ శ్రీను, ఉప్పులూరి లక్ష్మి,భవాని, యు.జ్యోతి, యు.జోజిమేరీ, యు.కేశవరావు, కిషోర్,కాటూరి శ్రీధర్,శారదా, షరీఫ్, రషీద్, ఆదినారాయణ, పొట్టేలు పెంటయ్య, హాజీ, బేతా శంకర్, ఎ.ఐ ఎస్.ఎఫ్ నాయకులు సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, వైద్య విద్యను పేదవర్గాలకు దూరం చేయొద్దని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. పిపిపి పద్ధతిలో నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న జి.ఓ.590 రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం జంగారెడ్డిగూడెం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి, కార్యాలయం సూపరింటెండెంటుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలకు మెడికల్ విద్యను దూరం చేసేలా ప్రభుత్వం జి.ఓ.590 తీసుకువచ్చిందన్నారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటుకు పూనుకుంటే పూర్తికాని 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ రంగం వారికి అప్పచెప్పడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలో పేదలకు ఉచిత వైద్యంతోపాటు వైద్య విద్యను అందు బాటులో ఉండేలా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్య,వైద్యం రాష్ట్ర ప్రజలకు ఉచితంగా అందిస్తామని కూటమి ప్రభుత్వం మభ్యపెట్టాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమానికి జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి జివి రమణరాజు అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ్య, బాడిస రాము, నిమ్మగడ్డ నరసింహ, కంచర్ల గురవయ్య,సిపిఐ జిల్లా సమితి సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, గోలిమే బాలయేసు, టి ఆంజనేయరాజు, పుప్పాల కన్నబాబు, టీవీఎస్ రాజు,బేతి కిషోర్, ఎల్. లక్ష్మణ్, తాళ్లూరి నాగరాజు, చందా త్రిమూర్తులు, జగన్నాథ హనుమంతు, గుడే ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

**భీమవరంలో:** మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని ప్రైవేట్ భాగస్వామ్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 590 ఉపసంహరించుకోవాలని, పిపిపి విధానం రద్దు చేయాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించి ఏపీ వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల బడుగు, బలహీన వర్గాలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాలను ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేదలు, బలహీన వర్గాలకు అండగా ఉండి వారి సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వం వైద్యాన్ని అందకుండా చేయడం దారుణమని కోనాల నిప్పులు చెరిగారు. ప్రయివేటు వైద్య కళాశాలలతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, కలిశెట్టి వెంకట్రావు, సనపల శ్రీనివాస రావు, సిపిఐ జిల్లా సమితి నాయకులు మల్లుల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య, నామన వెంకటేశ్వరరావు, నాయకులు ఎం.లక్ష్మీపతి, ఎస్.బ్రహ్మయ్య, ఎస్.అబ్బులు, పి.అబ్రహాం, పి.కృష్ణమూర్తి, జుత్తిగ నాగమణి, డి.వి.నాగేశ్వరరావు, కలిశెట్టి వందనం, పాలా త్రిమూర్తులు, పోతుల యాకోబు, ఎఐఎస్ఎఫ్ నాయకులు సుందర్, పవన్, యామిని, ఎఐవైఎఫ్ నాయకులు పవన కుమార్, వాడి ప్రవీణ్, వై.సంసోను తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ బంద్ జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - వేలేరుపాడు :** నూతనంగా ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న చేపట్టిన ఏజెన్సీ బంద్ జయప్రదం చేయాలని ఆదివాసి సంఘాలు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. సందర్భంగా పలువురు ఆదివాసి సంఘాల నాయకులు మాట్లాడుతూ నిర్వాసిత ప్రాంతాలను ఒక జిల్లాగా చేస్తానని ఇచ్చిన హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవా లన్నారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం సమంజసం కాదన్నారు. పునరాలోచన చేసి ఏజెన్సీ ప్రాంతం మొత్తాన్ని కలిపి పోలవరం జిల్లా చేయాలన్నారు. ఈనెల 22న నిర్వహించే ఏజెన్సీ బంద్‌లో వ్యాపారస్తులు విద్యాసంస్థలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు స్వచ్ఛందంగా మూసివేసి ఆ కార్యక్రమంలో పాల్గొనాలని ఏజెన్సీ జిల్లా సాధన కమిటీ నాయకులు కోరారు. ఈ సమావేశంలో మడివి దుర్గారావు, పొట్ల మోహన్, ఊకె ముత్యాలరావు,కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు తదితర ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని కుమార్తె వైద్యానికి చేయూత

**విశాలాంధ్ర - ఆగిరిపల్లి:** విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్‌గా పనిచేస్తున్న షేక్ బాజీ కుమార్తె అరుదైన దవడ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ గుంటూరులోని కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శస్త్ర చికిత్సకు మూడున్నర లక్షలు అవసరమైన తరుణంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆగిరిపల్లి మండల శాఖ ఉపాధ్యాయుల వద్ద నుండి సేకరించిన 1,09,901 మొత్తాన్ని మండల విద్యాశాఖ అధికారులు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనందకుమార్ సమక్షంలో స్థానిక తహసీల్దారు పి ఎస్ వి ప్రసాద్ చేతుల మీదుగా బాధిత ఉపాధ్యాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం అంటే కేవలం ఉపాధ్యాయుల సర్వీసు సంబంధిత సేవలు అందించడమే కాకుండా ఉపాధ్యాయులకు వారి ఆపద సమయంలో వారి ఆర్థిక అవసరాలను కూడా తీర్చే సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం అని వారి సేవలు అభినందనీయమని కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలో ఒకరికి బాధ కలిగితే స్పందించిన విధానం అద్భుతమని ఇది ఉపాధ్యాయులందరికీ గర్వకారణమని తెలిపారు. ఎస్టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడి నరసింహారావు మాట్లాడుతూ ఎస్ టి యు సేకరించిన 1,09,801 తో పాటు మండల విద్యాశాఖ అధికారి 1 హేబెలు ఉపాధ్యాయుల వద్ద నుండి సేకరించిన రూ.1,02,000, ఈదర హై స్కూల్ సిబ్బంది రూ.76,000, ఇతరులు రూ.32,000 లు మొత్తం కలిపి రూ.3,20,000 బాజీ కుమార్తె వైద్యానికి సాయం అందించినట్లు తెలిపారు. అనంతరం బాజీ మాట్లాడుతూ తమ కుమార్తె తమ కుమార్తె వైద్యానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె. పవన్ కుమార్, రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం వెంకటేశ్వరరావు, రామెళ్ళ సాంబశివరావు, సీనియర్ నాయకులు చౌటపల్లి సురేష్ కుమార్, షేక్ అబ్దుల్ హక్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ బిజె సుందరరావు, జిల్లా కౌన్సిలర్లు యు ఆర్ కె రాజు, మండల ఆర్థిక కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు, మండల నాయకులు తోట కిషోర్, ఎన్ సుగుణ రావు, వి వేణుగోపాలరావు, చిల్లపల్లి శ్రీదేవి, డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకే ఆదర్శమూర్తి మందలపు సత్యం

**విశాలాంధ్ర-లింగపాలెం:** సీనియర్ వైసీపీ నాయకులు, చింతలపూడి మాజీ సమితి అధ్యక్షులు మందలపు సత్య నారాయణ సంస్మరణ సభ మఠం గూడెంలోని ఆయన నివాసంలో గురువారం జరిగింది. ఈయన అభిమానులు, గ్రామ ప్రజలు,పార్టీల రహితంగా నాయకులు సంస్మరణ సభలో పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయాలలో ఈయన ఒక గొప్ప నాయకుడని కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులు ఈయనను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వైసీపీకి చెందిన జిల్లా, నియోజకవర్గ,మండల, గ్రామస్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మఠంగూడెం సర్పంచ్ పొదిల ప్రసాద్, వైసీపీ నాయకులు కంభం విజయరాజు, భీమిరెడ్డి వెంకటసురారెడ్డి, ముసునూరు, వెంకటేశ్వరరావు, అన్నపనేని శాంతారావు, దయ్యాల నవీన్ బాబు, సొంగా సందీప్, మట్ట సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు,వివిధ హోదాలలో ఉన్న నాయకులు సంస్మరణ సభలో పాల్గొన్నారు.

## విద్యార్థులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

**విశాలాంధ్ర - కుక్కునూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని సీపీఐ కుక్కు నూరు మండల

జాయింట్ సెక్రటరీ కురాకుల బాబూ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పిలుపులో భాగంగా కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. అనంతరం విద్యా రంగ సమస్యలపై కుక్కునూరు ఎమ్మార్వో రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ సభ్యులు శౌర్య, క్రాంతి చైతన్య, ప్రేమ్, వరుణ్, లక్కీ బ్రహ్మతేజ, ఆదర్శ్, అరుణ్, ప్రశాంత్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం పెద్దపీట

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో ఎర్రంపేట గ్రామంలో 60 లక్షల రూపాయలతో డబ్ల్యుబి యం రోడ్డుకు గురువారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని మారుమూల గ్రామాలను కూడా అభివృద్ధి చేయడం జరుగు తుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో రహదారులను నిర్మించడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, కొయ్యల గూడెం పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీనివాస్, ఎర్రం పేట, గ్రామ అధ్యక్షులు కామి శెట్టి సత్యనారాయణ, చోడసాని రాజేష్, ఉప్పు శ్రీను, కోన కుమార్, మాధవరపు శ్రీను, పైలా పోసియా, కొండ్రెడ్డి పూర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణ సేవా దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

**విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం :** నిస్వార్థపరుడు, మృదు స్వభావి, స్నేహశీలి, మంచి వ్యక్తిత్వం కలిగిన సీపీఐ నాయకులు పెదసనగంటి బాలకృష్ణ సేవా దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం జంగారెడ్డి గూడెంలోని బాలకృష్ణ స్వగృహం వద్ద సిపిఐ, ఏఐటీయుసి నాయకులు జర్నలిస్టు పెదసన గంటి బాలకృష్ణ సంస్మరణ సభ సిపిఐ జంగారెడ్డిగూడెం మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. బాలకృష్ణ చిత్రపటానికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్, బికేయంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ముస్తాఫ, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు ఎస్కే మస్తాన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సాలి రాజశేఖర్, సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం ధారయ్య మాట్లాడుతూ బాలకృష్ణ జంగారెడ్డి గూడెం మండలంలో సీపీఐ ప్రజాసంఘాల నిర్మాణానికి, అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. జర్నలిస్టుల అభ్యున్నతికి పాటు పడ్డారని తెలిపారు. బాలకృష్ణ నిస్వార్థ సేవను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. సంస్మరణ సభకు సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ బాలకృష్ణ అట్టడుగు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. సభలో సిపిఐ నాయకులు బాడిస రాము, నిమ్మగడ్డ నరసింహ, పిట్టా ప్రసాద్, కొన్నే లక్ష్మయ్య, టీవీఎస్ రాజు, జర్నలిస్టు కొదమ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. బాలకృష్ణకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కంచర్ల గురవయ్య, సన్నేపల్లి సాయిబాబు, పుప్పాల కన్నబాబు, టి.ఆంజనేయరాజు, గొలిమే బాలయేసు, కిషోర్, ఎల్ లక్ష్మణ్, టి. నాగరాజు, బంధం అర్జున్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## పస్తులతో పంచాయతీ కార్మికులు

**విశాలాంధ్ర - ఏలూరు:** పండుగ సమయాల్లో పస్తులతో పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారని, పంచాయతీ కార్మికులకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. కిషోర్,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు.గురువారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూని యన్ (ఏఐటీయూసీ) కమిటీ సమా వేశం యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్ఫూర్తి భవనంలో జరిగింది. ఈ సమావేశంలో కిషోర్, డాంగే మాట్లాడుతూ పెదపాడు, జాలిపూడి పంచాయతీ కార్మికులకు నాలుగు, ఐదు నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని అన్నారు. పెదపాడు పంచాయతీ కార్మికులకు ఏడాదిన్నర నుండి ఎరియర్స్ కూడా చెల్లించలేదని అన్నారు. జిల్లాలో అత్యధిక పంచాయతీల్లో ఇదేవిధంగా నెలల తరబడి జీతాలు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ప్రతి నెల సక్రమంగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవ డం వల్ల పంచాయతీ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండగలు దగ్గర పడుతున్నా జీతాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు పస్తులతో గడపాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారులి. అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో ఏఐటీయూసీగా ఆందోళన చేస్తామని అన్నారు. సమావేశంలో రవి, జోజి, జార్జి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన సిరామిల్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సూచనలమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర(మం), నెగ్గిపూడి గ్రామ కాపురస్తుడు మల్లిడి రిషు, S/o. లేటు ప్రేమ్ గారు మరియు వారి కుటుంబ సభ్యులు అందరు కలసి చేసుకున్న ఫ్యామిలీ అరేంజ్ మెంట్(సెటిల్‌మెంట్) దస్తావేజు నెం5099/2020 యస్.ఆర్.ఓ. తణుకు ది.08-09-2020న రిజిష్టరు కాబడిన రీత్యా ఎ-షెడ్యూలు ఆస్తి రిషుగారికి సంక్రమించినదని తదుపరి సదరు ఫ్యామిలీ అరేంజ్‌మెంట(సెటిల్‌మెంట్)దస్తావేజు నందు తప్పులు దొర్లినందున ది.22-04-2022న కుటుంబ సభ్యులు అందరూ కలసి సవరణ దస్తావేజును వ్రాసుకొని ద.నెం.1519/2022గా పెనుగొండ యస్.ఆర్.ఓ. నందు రిజిష్టరు చేసుకొనియున్నారు. మల్లిడి రిషుగారి వాటాకు రాబడిన ఆస్తిలో ఆర్.యస్.నెంబర్లు 43/2 మరియు 43/3లో చ.గ.2831.40లో చ.గ.688.33లు తన భార్య అయిన మల్లిడి ప్రేమ రమ్య గారికి సెటిల్‌మెంట్ దస్తావేజు చేసియున్నారని మిగిలిన ఆస్తిని(చ.గ2143.07లు) రిషిగారే సర్వ సంపూర్ణ హక్కుభుక్తములతో అనుభవించు చున్నారని తదుపరి రెవిన్యూ రికార్డుల నందు మల్లిడి రిషు గారి పేరుతో నమోదుచేయించుకొనియున్నారు. అట్టి ఆస్తికి చెందిన పార్టీషన్ దస్తావేజు నెం.1049/2012 ది.12-03-2012 మరియు ఫ్యామిలీ అరేంజ్‌మెంట్ సెటిల్‌మెంట్ డీడ్ ద.నెం. 5099/2020 ది.08-09-2020లో కొంత మంది అనగా మల్లిడి రమేష్,S/o మల్లిడి రామారెడ్డి గారి దత్తపుత్రుడైన మల్లిడి రోహన్ మరియు జసిరెడ్డి నాగ్రశియ, D/o.జసిరెడ్డి కృష్ణస్వామి మరణించియున్నారని మరియు వారికి చెందిన ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ లేవని సదరు గ్రామంలో విచారించినను వారి వారసుల గురించి ఎటువంటి ఆచూకీ లభించలేదని మరియు నా క్లయింటు కూడా సదరు విషయమై విచారించినను ఎటువంటి ఆచూకి లభించనందున ఈ ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన తనఖాలు, తాకట్లు, కోర్టు జప్తులు ఇతర క్లయిములు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7రోజులలోగా నాకుగాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారము లతో తెలియజేయగలరు. గడువులోగా ఎటువంటి క్లయిములు వగైరా రానియెడల నిష్పేచి ఆస్తులుగా భావించి నా క్లయింటు ఋణం మంజూరు చేయుదురని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండ్ చేయజాలవు.

**షెడ్యూలు:** పశ్చిమగోదావరి జిల్లా, శ్రీ భీమవరం జిల్లా, రిజిస్ట్రార్ వారి పరిధి, శ్రీ పెనుగొండ సబ్-రిజిస్ట్రారు వారి యిలాక, పెనుమంట్ర మండలం, మార్టేరు గ్రామము తాలూకు రి.స.నెం. 43/2,43/3లు, డోర్.నెం.2-94, అసెస్మెంట్ నెం.1712లో చ.గ.2143.07లు స్థలము అందలి ఆర్.సి.సి. బిల్డింగుకు **హద్దులు. తూర్పు:** కాలవ కట్ట, **దక్షిణం:** కె.సూకారెడ్డి వగైరాల గోడ, **పడమర:** మల్లిడి రిషు ఆస్తి, **ఉత్తరం:** కోడేరు-నల్లజర్ల మెయిన్ హైవే రోడ్డు.

**సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్**
AP LAW FIRM, # 54-1-7/2C/1, ప్లాటు నెం.FF2, శ్రీ సాయి వెంకట్ రెసిడెన్సీ, విజయలక్ష్మి కాలనీ, రోడ్డు నెం-1, ప్రతాప్ హస్పిటల్ రోడ్డు (ల్యాండ్ మార్క్), మహనాడు రోడ్డు, విజయవాడ -520007,సెల్:9441249798
విజయవాడ. తేది: 18-12-2025

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, మేదినరావు పాలెం గ్రామం, డోర్‌నెం.2-33 కాపురస్తులు చక్కా శ్రీమన్నారాయణ గారి కుమారుడు చక్కా గంగ సత్యనారాయణ అనువారు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం యావన్మందికి యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం మున్సిపల్ కార్పోరేషన్ లాసన్‌బేకాలనీ, బి/6, డోర్‌నెం.4-49-14రు ప్రస్తుతం హైదరాబాద్, ఆసిఫ్‌నగర్, శాంతినగర్, దుర్గాభ్రమర టవర్స్‌ప్లాట్ నెం.501 రు, డోర్‌నెం. **10-2-289/67/68/1** రు కాపురస్తులు పెయ్యల రమేష్ గారి కుమార్తె పెయ్యల అనూష గారి స్వార్జితపు ఆస్తి అనిన్నీ వారి సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో కల ఆస్తి అనిన్నీ నా క్లయింటు కు పూరా హక్కులతో విక్రయించగలందులకు అంగీకరించి విక్రయ ఖరారు అగ్రిమెంటును చేసుకునియున్నారు.

కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిన్ని సదరు విక్రయదారులు పూరా హక్కులతో నా క్లయింటు కు విక్రయించి స్వాధీనపరుచుటలో ఎవరికైనను అభ్యంతరములు , ఆక్షేపణలు వివాదములు మరియు పేచీలు వగైరా సమస్యలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి (10) రోజులలో నా క్లయింటుకు నేరుగా గాని లేక నాకు గాని వ్రాతపూర్వకంగా తగు ఆదారములతో అందచేసి ఎక్నాలెడ్జిమెంట్ (రశీదు) పొందవలయును. అట్లు తెలియజేయని యెడల దిగువ షెడ్యూలు ఆస్తి నిరభ్యంతర/నిర్వివాద/ నిష్పేచీ/ ఆస్తిగా గుర్తించి నిర్ధారించుకుని మరియు నమ్మి నా క్లయింటు తన పేరున గాని లేక తను కోరిన వారి పేరున గాని సదరు విక్రయదారులు నుండి క్రయం చేసి రిజిష్టరు క్రయదస్తావేజును పొంద గలరు. సదరు క్రయం దర్శిగా లేపదీయు అభ్యంతరములకు, ఆక్షేపణలకు , వివాదములకు మరియు పేచీలు వగైరా సమస్యలకు నా క్లయింటు ఏమాత్రం బాధ్యుడు కాజాలడు అని తెలియజేయుచున్నాను.

**షెడ్యూలు ఆస్తి వివరము:1వప్రతి :** లోగడ పశ్చిమగోదావరిజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు సబ్-డిలో చేరిన రామారావు గూడెం గ్రామ పంచాయితీ,రామారావు గూడెం గ్రామములోని సర్కారు జిరాయితీ మెరక రి.స.నెం.191/2ఎ రు దాఖలా య 1-16ట్లులో ఉత్తరం వైపు య 0.83ట్లు, రి.స.నెం.191/2బి రు దాఖలా య 1-50ట్లులో ఉత్తరం వైపు య 1.17ట్లు **వెరశి ఏకప్రతి గా వున్న య 2.00ట్లు భూమికి హద్దులు:తూర్పు:**కాలిరామయ్యశెట్టి, కాలిప్రసాదరావు వగైరాల భూమి.**దక్షిణం:** పెయ్యల అవినాష్ గారి భూమి, **పడమర:** దాసరి సూర్యనారాయణ వగైరాల భూమి. **ఉత్తరం :** పెయ్యల విజయభారతి గారి రి.స.నెం.**191/3** రులో భూమి కొంత, 2వ ప్రతి కొంత, నేతల తులసమ్మ గారి భూమి కొంత.

యీ హద్దుల మధ్య య **2.00ట్లు భూమిన్ని**

**2వప్రతి :** లోగడ పశ్చిమగోదావరిజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు సబ్-డిలో చేరిన రామారావు గూడెం గ్రామ పంచాయితీ , రామారావు గూడెం గ్రామములోని సర్కారు జిరాయితీ మెరక రి.స.నెం.**191/2బి** రు దాఖలా య 1-50ట్లులో సుమారు ఈశాన్య మూల య 0.03ట్లు (0.012హె) బోరు భూమికి **హద్దులు : తూర్పు :** పెయ్యలవిజయభారతి గారి భూమి.**దక్షిణం:** 1వ ప్రతిభూమి, **పడమర:** 1వ ప్రతిభూమి **ఉత్తరం :** 1వ ప్రతిభూమి.

యీ హద్దుల మధ్య య 0.03ట్లు భూమిన్ని ఇందలి బోర్‌వెల్ 15 హెచ్‌పి మోటారు కరెంటు సర్వీసు నెం.123రులో 2/9 వంతు అవిభక్తపు జాయింటు హక్కు సహాయున్నూ **1వ ప్రతి భూమికి** అనాది నుండి ఏర్పడియున్న మాములు మార్గములు , పసర్లు నీటి బోదెలు వగైరా యీజ్‌మెంట్ హక్కులతో సహా.

**నోట్ :** రి.స.నెం.191/2ఎ, రి.స.నెం.191/2బి, ల్లు ఉత్తరర వైపున,పడమర వైపున దారి ఏర్పాటు చేసుకుని నాక్లయింటు, పెయ్యల విజయభారతి గారున్నూ, పెయ్యల అఖిలాష్ కుమార్ , పెయ్యల అవినాష్ గారున్నూ రాకపోకలు సాగించుకోగల నిర్ణయమై వున్నది. అని తెలియజేయుచున్నాను.

**కొరుకొండ రాజారామ మోహన్ ,అడ్వకేట్**
ఏలూరు సెల్ : **94404 20223**

### SBI భారతీయ స్టేట్ బ్యాంక్
ముదినేపల్లి బ్రాంచి (02758), ముదినేపల్లి, కృష్ణా జిల్లా-521325.

### స్వాధీనత ప్రకటన
APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, ముదినేపల్లి బ్రాంచి (02758), ముదినేపల్లి, కృష్ణా జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము **ది.06-10-2025** నాటికి **రూ.33,54,837/-** (అక్షరాల ముప్పైమూడులక్షల యాభైనాలుగువేల ఎనిమిదివందల ముప్పైఏడు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: **శ్రీ కొల్లిపర వెంకటేశ్వరరావు తండ్రి మల్లిఖార్జునరావు,** డోర్ నెం:6-54/7, పడాలి రోడ్, ముదినేపల్లి, కృష్ణా జిల్లా. **హెచ్‌యల్ నెంబర్లు: 41649213961, 41652805634** వీరిని కోరుతూ ది:06-10-2025 వ తేదీన డిమాండు నోటీసును మరియు ది:10-10-2025న పత్రికా ప్రకటన ప్రచురించడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి మొత్తం బకాయి **ది.06-10-2025** నాటికి **రూ.33,54,837/-** మరియు తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

**స్థిరాస్తి వివరము**

కృష్ణా జిల్లా, ముదినేపల్లి, డోర్ నెం:6-54/7, ఆర్‌యస్ నెం.221/2 లోని 170 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి భవనము శ్రీ కొల్లిపర వెంకటేశ్వరరావు తండ్రి మల్లిఖార్జునరావు గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.1075/2010, తేది:02-09-2010, ముదినేపల్లి యస్ఆర్ఓ, కృష్ణా జిల్లా. **హద్దులు:** తూర్పు: పంట బోదె, దక్షిణం: మొహమ్మద్ సయ్యద్ బాజి యొక్క స్థలం, పడమర: బజారు, ఉత్తరం: బజారు.

తేది : 15-12-2025
ప్రదేశం: నూజివీడు
అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

### SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్ (ఆర్‌ఎసిపిసి) (64515) 25-165, యస్ వాణి టవర్స్, మొదటి అంతస్థు, భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన, హనుమాన్‌జంక్షన్ రోడ్, నూజివీడు, ఏలూరు జిల్లా-521 201.

### డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

టు
**1) శ్రీమతి మొండితోక మాలతి భర్త: యం చల్లారావు**
**2) శ్రీ మొండితోక చల్లారావు తండ్రి: యం ముత్యాలు**
డోర్ నెం: 2-56, అన్నవరం, ఏలూరు జిల్లా-521201.
**హోమ్ లోన్ అకౌంట్ నెంబర్లు: 62490172604, 62490173108.**
మేడమ్ / సార్,

మీరు యస్‌బిఐ టౌన్ బ్రాంచి, నూజివీడు ఏలూరు జిల్లా నుండి ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచి వివిధ క్రెడిట్ ఫెసిలిటీస్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు లోన్ ఋణము **ది.05-12-2025వ తేదీ నాటికి మొత్తము బకాయి రూ.8,98,703/- (అక్షరాల ఎనిమిదిలక్షల తొంభైఎనిమిదివేల ఏడువందల మూడు రూపాయలు మాత్రమే)** మరియు ఒప్పందపరమైన వడ్డీ తదుపరి కాస్ట్లు, ఛార్జీలు, ఇతరములైన ఖర్చులు మొత్తము బకాయిగా ఉన్నవి.

**తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము**
**కృష్ణా జిల్లా, నూజివీడు జెయస్‌ఆర్ఓ, శ్రీమతి మొండితోక మాలతి, భర్త: చల్లారావు గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.6660/2016, తేది:14-10-2016**

కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, నూజివీడు రెవిన్యూ మండల పరిధి, అన్నవరం గ్రామ పంచాయితి, డోర్ నెం.2-56, ఆర్‌యస్ నెం.317/2 లోని 290.4 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించబడిన **భవనమునకు హద్దులు:** తూర్పు: శ్రీమతి మొండితోక అలివేలు & వారి కుమారులు మరియు కుమార్తెలు యొక్క ఆస్తి, దక్షిణం: అన్నవరం టు ముక్కొల్లుపాడు రోడ్డు, పడమర: శ్రీమతి మొండితోక అలివేలు యొక్క ఆస్తి & గంగానమ్మ రావి చెట్టు, ఉత్తరం: శ్రీమతి మొండితోక అలివేలు & వారి కుమారులు మరియు కుమార్తెలు యొక్క ఆస్తి.

**శ్రీమతి మొండితోక మాలతి భర్త: యం చల్లారావు** మీకు బ్యాంకు వారు మంజూరు చేసిన ఋణసౌకర్యం నిమిత్తం పైన ఉదహరించిన స్థిరాస్తులను తనఖా ఉంచినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **ది.05-12-2025వ తేదీన డిమాండ్ నోటీసును** బ్యాంకుచే మీకు జారీచేయడమైనది. కానీ జారీ చేసిన నోటీసును ఋణగ్రహీత స్వీకరించనందున **ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.** బ్యాంకు వారు జారీచేసిన షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం **ది.05-12-2025** న ఎన్.పి.ఎగా (మొండిబకాయి) వర్గీకరించబడినది. సదరు పైన తెలిపిన ఋణమొత్తము మరియు ఒప్పందపరమైన వడ్డీ ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002 లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.

తేది : 18-12-2025
ప్రదేశం: నూజివీడు
అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## అనుమానాస్పద స్థితిలో మూగ జీవాల మృతి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని ముల్లకలంక గ్రామంలో గురువారం బిత్తికొండ సత్యనారాయణ అనే రైతుకు చెందిన తొమ్మిది లేగ దూడలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. దీనిపై సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ రైతు ఇచ్చిన సమాచారం మేరకు ముల్లంకలంక గ్రామంలో మృతి చెందిన ఒక సంవత్సరం వయస్సు గల తొమ్మిది గేదె దూడలను వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం మృతి చెందిన దూడల శరీరంలో విష పదార్థాలు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.

**విశాలాంధ్ర**
**తూర్పుగోదావరి జిల్లా**

## మండలంలో ముగిసిన సంసద్ ఖేల్ క్రీడలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో గురువారం ఘనంగా ముగిసిన సంసద్ ఖేల్ క్రీడా పోటీలు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఎమ్ భారతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన క్రీడా పోటీలో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ 19 నుంచి 20వ తేదీల్లో జిల్లా స్థాయిలో జరగబోయే పోటీలో పాల్గొంటారని అన్నారు. పదవీ విరమణ కాబోతున్న సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయుడు ఎ. మల్లికార్జునరావు, పీడీ మిర్తిపాడు వారికి సన్మానం చేశారు. తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి.భువనేశ్వరి, కోరుకొండ జోన్ ప్రెసిడెంట్ ఎ డి. ప్రసాద్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు వీరభద్రరావు, పి డిలు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సొమ్ము ప్రైవేటుకు తాకట్టు

### మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాజమండ్రిలో సీపీఐ ధర్నా

విశాలాంధ్ర- రాజమండ్రి : ప్రజారోగ్య రంగాన్ని పిపిపి పేరుతో ఖూనీ చేయడం దారుణమని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం స్థానిక నూతన మెడికల్ కళాశాల వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రజా వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తే సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, ఉపాధి, భద్రత పేద మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నెంబర్ 590 ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని దెబ్బతీస్తుందని మధు పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 590 విడుదల చేసి మార్కాపురం, మదనపల్లి ,ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గం అన్నారు. మెడికల్ కాలేజీలు పిపిపి విధానం వల్ల ప్రభుత్వ భూములు భవనాలు కాలేజీల ఆసుపత్రులు దాదాపు 60 ఏళ్ల పాటు ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 70 శాతం పడకలు ఉచితంగా వైద్య సేవలు కోసం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతున్నా మిగిలిన 30% చెల్లింపు పడకల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో పేదలకు వైద్యం అందక అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు, సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీవో నెంబర్ 590 తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానాన్ని వెనక్కు తీసుకునే వరకు కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రేఖ భాస్కరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, పి.లావణ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి. త్రిమూర్తులు, పంతం నాగేశ్వరరావు, ఎం. ప్రసాద్, జట్ల సంఘం పి. దేవుడు బాబు, నల్ల రామారావు, రెడ్డి వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రెడ్డి రమణ, కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, నిడదవోలు పార్టీ నాయకులు, విద్యార్థులు, జట్లసంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో మహమ్మారిని తరిమికొట్టాలి

- 21న పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి

-పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం : పోలియో మహమ్మారిని నియోజకవర్గ వ్యాప్తంగా తరిమికొట్టాలని రాజానగరం నియోజక వర్గ శాసన సభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. మండల కేంద్ర మైన రాజానగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో రాజానగరం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం(పి. హెచ్.సీ) ప్రధాన వైద్యులు డాక్టర్ రామ్ భాస్కర్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రోగనిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలోపు ఉన్న పిల్లలు 21,853 మంది ఉండగా 64,382 గృహాలు సందర్శించాల్సిన అవశ్యకత ఉందన్నారు. తమ చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని అందుకు తల్లి దండ్రులు సహకరించాలని కోరారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు డాక్టర్ రామ్‌భాస్కర్ గట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాజానగరం మండలంలో 8319, సీతానగరం మండలంలో 5863, కోరుకొండ మండలంలో 7671 మంది చంటి పిల్లలు ఉన్నారని చెప్పారు. వారికి పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా 1,418 వ్యాక్సిన్లు సిద్ధంచేయగా 158 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు డాక్టర్ రామ్ భాస్కర్ గట్టి, ఏపీ లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ నీలపాల అరవ రాజు, నాయకులు తోట రామకృష్ణ, వడ్డీ చిన్న, కాళ్ళ బుజ్జి, పిడుగు సురేష్, సర్పంచ్ కిమిడి శ్రీరామ్, కూటమి నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రితో ఎమ్మెల్యే మద్దిపాటి భేటీ

విశాలాంధ్ర - నల్లజర్ల : ఇచ్చిన హామీలను అమలు చేయాలని. ఢిల్లీలో కేంద్ర రవాణా మరియు జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజకవర్గంలో జాతీయ రహదారులపై సర్వీస్ రోడ్లు, విస్తరణ, అండర్ పాస్ నిర్మాణాలు పై రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తో కలిసి కేంద్ర రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నియోజవర్గంలోని జాతీయ రహదారులపై సమస్యలను వివరించారు. గోపాలపురం నియోజకవర్గం లో ఎం. నాగులపల్లి నుంచి ఫ్లైఓవర్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ, పుల్లలపాడు వద్ద అండర్‌పాస్ నిర్మాణం, తదితర ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, ఆయా రోడ్డు విస్తరణ పనులపై తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఎంపీతో ఎమ్మెల్యే మద్దిపాటి భేటీ

విశాలాంధ్ర - నల్లజర్ల : ఏలూరు జిల్లా పరిధిలోని ద్వారకాతిరుమల మండలంలోని చేపట్టనున్న అభివృద్ధి పనులు పై ఢిల్లీలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మండలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బీసీల సంక్షేమం, వారి అభివృద్ధిపై ఎంపీ దృష్టికి తీసుకువెళ్లామని ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు.

## స్వరూపకు 'మానవత' ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామ జడ్పీ హైస్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థిని సరిపల్లి జ్ఞాన స్వరూప ఫుట్ బాల్ అండర్ 17 నేషనల్ బాలికల క్రీడల్లో ఎంపికైంది. జార్ఖండ్ లో నిర్వహించే ఈ క్రీడలకు వెళ్ళుటకు ప్రయాణ ఖర్చు నిమిత్తం 5000 రూపాయలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ అందించారు. క్రీడలపై ఎంతో ఆసక్తితో అనేక క్రీడ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలుస్తున్న జ్ఞాన స్వరూపను అభినందించారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ పేదరికం ఏ విద్యార్థికి శాపం కారాదనే లక్ష్యంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన ఆర్థిక, నైతిక సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీమాతో రైతులకు ధీమా

విశాలాంధ్ర - గోపాలపురం : సహకార సంఘాల ఆర్థిక లావాదేవీలు డిజిటల్ దశకు మారనున్న నేపథ్యంలో రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష, అటల్ పెన్షన్ యోజన మరియు ఆర్థిక అక్షరాశ్యత పై అవగాహన కల్పించారు. ఈ పథకాల్లో చేరాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏలూరు , ఫైనాన్షియల్ కౌన్సెలర్ ఎం. బాలకృష్ణ సూచించారు. గురువారం గోపాలపురంలోని సొసైటి ప్రాంగణంలో సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేష్ బాబు అధ్యక్షతన రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంపాదనలో ఎంతో కొంత సహకార బ్యాంకుల్లో పొదుపు చేస్తే సరైన సమయంలో అక్కరకొస్తుందన్నారు. కార్యక్రమంలో గోపాలపురం బ్రాంచి మేనేజర్ ఉద్దగిరి శ్రీనివాస రావు , సూపర్వైజర్ ఎన్. రామ లక్ష్మీ , సొసైటీ కార్యదర్శి ఆర్ ఎన్. సతీష్ కుమార్ , సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కాటవరం గ్రామంలో గురువారం యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ ఎన్నికలో భాగంగా మండల అధ్యక్షుడిగా ఆర్. పాపారావు, ప్రధాన కార్యదర్శిగా పి. సత్తిబాబు ఎన్నికయ్యారు. జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఎన్నికల అధికారిగా, జిల్లా కార్యదర్శి శ్రీమణి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ " ప్రస్తుత కాలంలో ఉపాధ్యాయుల పై తీవ్రమైన ఒత్తిడి ఉందని, బోధనేతర కార్యక్రమాల నిర్వహణ ఎక్కువైపోయిందని, బోధనా సమయం అంతా యాప్ లలో సమాచారం నింపడానికే సరిపోతుందని" అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరీక్షలకు సిద్ధమవుదాం - భవితను గెలుచుకుందాం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ :10వ తరగతి విద్యార్థినుల్లో పరీక్షలపై అవగాహన పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గురువారం బొమ్మూరులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో "పరీక్షలకు సిద్ధమవుదాం - భవితను గెలుచుకుందాం" అనే అంశంపై ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మల్లి భాస్కర్ ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లి భాస్కర్ మాట్లాడుతూ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక దశ మాత్రమేనని, సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదివితే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించగలడని తెలిపారు. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే పద్ధతులు, సమయ నిర్వహణ, స్మరణశక్తి పెంపు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కె.ఎన్. జ్యోతి మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులు విద్యను ఆయుధంగా మలుచుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## అంగన్వాడీలకు చరవాణిలు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - రాజానగరం : తమ కేంద్రాల్లోని చిన్నారుల స్థితిగతులు, కార్యకర్తల పనితీరు ఎప్పటికపుడు ఉన్నతాధికారులకు నవీకరణ చేసేందుకు ప్రభుత్వం అందించిన చరవాణిలు (మొబైల్స్) దోహదపడ తాయని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలోని ఐసిడిఎస్ సిడిపివో కార్యాలయం నందు ఏసీడీపీవో కనకవల్లి అధ్యక్షతన ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలకు గురువారం ప్రభుత్వం కేటాయించిన ఫోన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడిలు పని భారం తగ్గించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లు సక్రమంగా వినియోగించుకుంటూ మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకురావాలని కోరారు. సిడిపివో జి.గౌరమ్మ విశాలాంధ్రతో చరవాణిలో మాట్లాడుతూ తమ ప్రాజెక్టు లోని అంగన్వాడిలు, సూపర్వైజర్లకు కలిసి 324 మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ నీలపాల అరవ రాజు,కూటమి నాయకులు తోట రామకృష్ణ, కిమిడి శ్రీరాం, స్థానిక నాయకులు,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల మధ్య జగన్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - కడియం : వైసీపీ అధినేత జగన్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా గురువారం గిరజాల బాబు మిత్రమండలి ఆధ్వర్యంలో కడియం బిసి హాస్టల్‌లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులకు సుమారు 28 మందికి స్వెటర్లు, బిస్కెట్స్, పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కనుమరుగుతున్న ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థను నాడు నేడు, ఇంగ్లీష్ విద్య, అమ్మ ఒడి తదితర విప్లవాత్మకమైన మార్పుల ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడి విద్యార్థుల హృదయంలో జగన్ మామయ్యగా నిలిచిపోయారు అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రమేష్, కలవల రవి, గుత్తుల సత్తిబాబు, అబ్బులు, పూడి బ్రహ్మం దంగుడుబియ్యం సుబ్బారావు, చిలుకూరు రామకృష్ణ, బిల్లకుర్తి ముత్యాలరావు, శాకా సతీష్, ఎస్ వీరనాగు, సర్కార్ భాష, సంతోష్, పున్నమిరాజు వీర్రాజు, మహిపాల్ వాసు, కోసూరి సూరిబాబు, బత్తిన శ్రీధర్, వనుం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి స్థాయి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - కడియం : విద్యార్థులు చిన్ననాటి నుండి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. ఏవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి బృందాలు పాల్గొన్న ఈ కార్యక్రమం 7 విభాగాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గా ఎంఇఓ 2 వై నాగేశ్వరరావు, న్యాయ నిర్ణయితలుగా జిల్లా విద్య శిక్షణా సంస్థ లెక్చరర్స్ పంతం శ్రీ వెంకట దుర్గ, జిలాని భాషా వ్యవహరించారు. సస్టైనబుల్ అగ్రికల్చర్ విభాగంలో కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేస్ట్ మేనేజ్మెంట్ విభాగంలో కడియపులంక పాఠశాల, గ్రీన్ ఎనర్జీ విభాగంలో చైతన్య నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎమర్జింగ్ టెక్నాలజీస్ విభాగంలో పొట్టిలంక పాఠశాల, రిక్రియేషనల్ మ్యాథమెటిక్స్ మోడలింగ్ విభాగం మరియు హెల్త్ అండ్ హైజీన్ విభాగంలో దుల్ల పాఠశాల, వాటర్ కన్జర్వేషన్ మేనేజ్మెంట్ విభాగంలో వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

## తెలుగుదేశానికి పూర్వ వైభవం తీసుకువస్తా

### తూర్పు గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట రమణ చౌదరి

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : తెలుగుదేశం పార్టీలో అందర్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానే పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం తీసుకువస్తానని తూర్పు గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టిన బొడ్డు వెంకట రమణ చౌదరి హైదరాబాద్ నుండి తొలిసారిగా నియోజకవర్గంలోని మధురపూడి విమానాశ్రయానికి గురువారం చేరుకున్నారు. దీంతో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు తన అనుచర వర్గంతో విమానాశ్రయానికి చేరుకొని ఘన స్వాగతం పలికారు. శ్రీరామచంద్రుని భారీ చిత్రపటం అందజేశారు. ఏపీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గంగిశెట్టి చంటిబాబు, యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ నీలపాల అరవ రాజు లతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలు భారీగా విమానాశ్రయం వద్దకు చేరుకొని ఘన స్వాగతం పలికారు. దీనిలో భాగంగా ఎయిర్ పోర్టు ప్రాంగణం నుండి ప్రధాన ద్వారం వరకు భుజాలపై ఎక్కించుకుని తమ అభిమానని చాటుకు న్నారు. ఒక పక్క విమానాల హోరు మరో పక్క తెలుగు తమ్ముళ్ళ జోరుతో విమానాశ్రయం ప్రాంగణం హోరెత్తిపోయింది. ప్రధాన ద్వారం వద్ద గజమాల వేశారు. అక్కడ నుండి కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. దీంతో ఆలయ అర్చకులు, అధికారులు మేళతాళాలతో స్వాగతం పలికారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పారదర్శకంగా జిల్లా అధ్యక్షులను నియమించడం జరిగిందన్నారు. రాజానగరం నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు పార్టీకి సేవలు అందించిన వారికి తనకు మద్దతిచ్చిన నేతలు ప్రతిఒక్కరు ఉన్నత స్థానంలో ఉండేవిధంగా చూడాలని ఉందన్నారు.ఏపీ అభివృద్ధికోసం రానున్న పదేళ్లు కూటమి తోనే పయనిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు పెనుగొండ శ్రావణ లక్ష్మీ, పెమ్మనబోయిన వెంకటేష్, నాయకులు బచ్చు ప్రసాద్, నూనె వెంకన్న ,చిట్టిప్రోళ్ళ పద్దరాజు, డాక్టర్ అత్రు రాజేష్, సోడసాని త్రిమూర్తులు, గెద్దం తిమ్మరరావు, ఖండ్రు శేఖర్, పెందుర్తి రాజా, కృష్ణ చైతన్య, దూది కాంతారావు,అడపా వీరబాబు, తనకల నాగేశ్వరావు,పిత శ్రీను,అప్పల నాయుడు, నాయకులు , కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హేమస్మితకు ఉత్తమ సేవా పత్రం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి హేమ స్మిత ఉత్తమ సేవ పత్రం అందుకున్నారు. గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వ శ్రీ పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పొగాకు వేలం ప్రక్రియలో సమర్థవంతంగా వ్యవహరించి ఉత్తమ సేవలందించిన హేమ స్మితకు ఈ అవార్డు లభించింది. ఉత్తమ సేవ అవార్డు అందుకున్న హేమ స్మితను దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం సిబ్బంది హేమ స్మితను అభినందించారు. ఈ సందర్భంగా హేమ స్మిత మాట్లాడుతూ సిబ్బంది రైతులు పొగాకు కంపెనీ ప్రతినిధుల సహకారంతో తాను సమర్థవంతంగా వేలం ప్రక్రియ నిర్వహించానని తెలిపారు.

## యర్నగూడెంలో పొలం బడి

విశాలాంధ్ర-దేవరపల్లి: యర్నగూడెం రైతు సేవ కేంద్రంలో రబీ పొలంబడి గ్రామ సభ డివిజనల్ అగ్రికల్చర్ ఆఫీసర్ చింతా శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. సి ఏ. డి జయలక్ష్మి,మార్టూరు ప్రధాన శాస్త్రవేత్త మనుకొండ శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారి కె.కమల్ రాజ్ , యర్నగూడెం సొసైటీ ఛైర్మన్ పి.సుబ్బరాజు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పంటల సరళి సాగు ప్రణాళిక పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త యం. శ్రీనివాస్ మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణ చేయడం ఎలా,దాని ఉపయోగాలు ,లాభదాయక పంటల సాగు విధానాల పై శిక్షణ ఇచ్చారు.రైతులు పంట అవశేషాలు కాల్చడం వల్ల జరిగే నష్టాలు తెలియచేశారు.పంట కోత్త తరువాత దుబ్బు కుళ్ళడం చాలా ప్రాముఖ్యం అని చెప్పారు. అవశేషాలు కాల్చడం వలన పంటకు ఉపయోగ పడే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలియచేశారు. మండల వ్యవసాయ అధికారి కె కమల్ రాజ్ మాట్లాడుతూ పంటల సరళి సాగు ప్రణాళిక గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుడోమోనస్‌తో వరి విత్తన శుద్ధి పద్ధతిని ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉద్యాన శాఖ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలు అవసరమే

విశాలాంధ్ర - తాళ్లపూడి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు పట్ల కూడా పోటీ తత్వాన్ని పెంచుకోవాలని తాళ్లపూడి ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి అన్నారు. తాళ్లపూడి మండలం లోని పలు హైస్కూల్స్‌లో చేపట్టిన సన్ సద్ ఖేల్ మహోత్సవ 2025 క్రీడా పోటీలు ముగిసాయి. అన్నదేవరపేట లో జరిగిన కార్యక్రమం లో సొసైటీ అధ్యక్షులు జి.వి.ప్రసాద్, ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ప్రసాద్, కూచిపూడి గణపతి, వేగేశ్వరపురం హైస్కూల్‌లో ఎం.ఈ.ఓ బాలామణి, సర్పంచ్ కె.పి.రామా రావు, నాయకులు కైగాల శ్రీనివాస్, మలకపల్లి హైస్కూల్‌లో సర్పంచ్ రాజేశ్వరి, సెక్రటరీ కామేశ్వరి, ఆర్.ఐ సాహిత్య, క్రీడోపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - తాళ్లపూడి:మండల కేంద్రమైన తాళ్లపూడిలోని శ్రీ సాయి స్ఫూర్తి ఆసుపత్రిలో గురువారం 0 నుండి 15 సంవత్సరం లోపు పిల్లల కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 600 మందికి పైగా వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ శిబిరానికి హాజరయ్యారు. దంత వైద్య, కంటి వైద్య విభాగాలు, చిన్న పిల్లలు ఎదుర్కొనే అనారోగ్యాలకు సంబంధించిన పిడియాట్రిక్, గైనిక్, జనరల్ సర్జన్ విభాగాలకు చెందిన డాక్టర్లు వివిధ వైద్య పరీక్షలు ఉచితంగా చేసి వారికి అవసరమైన మందులు అందచేశారు. మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని సి.ఈ.ఓ సుధీర్ తెలిపారు. వైద్యులు శాంతి, సాగర్, రాజరాజేశ్వరి, రామారావు, జగదీష్, ప్రశాంత్, మౌనిక, రేణుక, శ్రీరామ్ వైద్య సేవలు అందించారు.

## అసత్య ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ జగన్

### అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :అసత్య ప్రచారం చేయడంలో జగన్ ది అందె వేసిన చెయ్యి అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివేకానంద రెడ్డిని హత్య చేయించి దానిని చంద్రబాబు నాయుడి మీదకు నెట్టారని , కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. యూరియా రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్నప్పటికీ యూరియా సరఫరా లేదని జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నడపాలని ప్రయత్నిస్తుంటే, ఏకంగా ప్రయివేటు వారికి ప్రభుత్వ కళాశాలలు ఇచ్చేస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేనప్పటికీ , ధాన్యం కొనుగోలు జరగడం లేదని ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ కి రైతుల మీద అంత ప్రేముంటే రైతులకివ్వాల్సిన బకాయిలు ఎందుకు చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే రైతులకివ్వాల్సిన బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తికి చెందిన పలువురు కూటమి సభ్యులు కూడా పాల్గొన్నారు.

## న్యూటన్‌కు క్రిస్టియన్ ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర - నిడదవోలు :క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కొవ్వూరు ఎమ్మెల్యే కార్యాలయంలో గ్లోబల్ పీస్,కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యా వేత్త, సామాజిక సంస్కర్త డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు క్రిస్టియన్ ఎక్సలెన్స్ 2025 అవార్డును కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు అందజేశారు. న్యూటన్ గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను తెలుసుకొని అభినందించారు. ఐజక్ న్యూటన్ నేటి సమాజానికి ఆదర్శమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతీఒక్కరూ పాటుపడాలని వెంకటేశ్వరరావు కోరారు. ఐజక్ న్యూటన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 67 అవార్డులు వచ్చా యని క్రిస్టియన్ ఎక్సలెన్స్ 2025 అవార్డు రావడం మరింత భాధ్యత పెంచిందన్నారు. నిన్ను వలే నీ పొరుగు వానిని ప్రేమించుమనే యేసుక్రీస్తు సందేశం ఆదర్శమని న్యూటన్ అన్నారు. ఈసందర్భంగా యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిల్లి జయకర్, విప్పర్తి స్వర్ణ కుమారి, బాబు సొలొమాన్ పండు, మేరీ జొన్స్ అమూల్, సుకేసిని, రాజకుమారి తదితరులు అభినందించారు.

## షర్మిల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం దేవరపల్లిలో జై కిసాన్ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ జన్మదిన వేడుకల్లో గోపాలపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మార్టిన్ లూథర్, పిసిసి కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి జేష్ట సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి మెలగా రామకృష్ణ జన్మదిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మార్టిన్ లూథర్ పిసిసి ప్రధాన కార్యదర్శి జేష్ట సతీష్ బాబు పీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి వెలగా రామకృష్ణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గుణాలను ఆదర్శంగా తీసుకుని పిసిసి అధ్యక్షురాలుగా రాష్ట్రంలో ఎంతో సమర్థ వంతంగా వైఎస్ఆర్ షర్మిల బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని సంకల్పంతో కాంగ్రెస్ పార్టీని షర్మిల రెడ్డి మరింత పటిష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జై కిసాన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాకా చిన్నబ్బులు,మట్టపర్తి రామ్మోహన్రావు, నల్ల వీర్రాజు, గుత్తికొండ సూరిబాబు, కాటం రామకృష్ణ, గన్నిన రామానాయుడు, మనీ సాయి గోపాలపురం నియోజక వర్గంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ఇంటికొకరు పారిశ్రామికవేత్త కావాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ఇంటింటికి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలానికి 50 నుంచి 100 మంది పారిశ్రామికవేత్తలు తయారైతే, వారు మరింత మందికి ఉపాధి కల్పిస్తారని, దానితో గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) స్థాపనపై ద్వాక్రా సంఘాల యానిమేటర్లు తదితరులకు కొత్తపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఆర్డీఏ పీడీ ఇన్‌చార్జ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా రావులపాలెంలో ఎంఎస్ఎంఈ గైడెన్స్ కార్యాలయం ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యాలయంలో నలుగురు యువ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని వివరించారు. ద్వాక్రా మహిళలు ఇప్పటికే స్వయం ఉపాధిలో నైపుణ్యం సాధించారని, మహిళలను మరింత ప్రోత్స హించాలనే ఉద్దేశంతో నూతన ద్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రూ.15 వేల ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష ప్రోత్సాహం అందిస్తున్నాయని, మహిళలకు 35 శాతం సబ్సిడీ, ఎస్సీ వర్గాలకు చెందిన మహిళలకు 45 శాతం సబ్సిడీ అందుతుందని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు చేయాలనుకునేవారు వినూత్నంగా ఆలోచించాలని, టెక్నాలజీ బేస్డ్, మార్కెటింగ్ బేస్డ్, సర్వీస్ సెక్టార్‌లను బేరీజు వేసుకుని పరిశ్రమలను గ్రౌండ్ చేయాలని సూచించారు. క్యాయర్ పరిశ్రమ స్థాపనపై ఆసక్తి ఉన్నవారు నేరుగానే అత్యాధునిక యంత్రాలతో ఏర్పాటు చేసిన పరిశ్రమలను సందర్శించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు బంగారు బాతుల్లాంటివని, కేవలం సబ్సిడీ కోసమే పరిశ్రమను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. సిబిల్ స్కోర్‌ను మెయింటైన్ చేస్తే గ్యారంటీ లేకుండానే బ్యాంకులు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. జనవరి 11, 12, 13 తేదీల్లో ఆత్రేయపురంలో డ్రాగన్ పడవ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని, స్టాల్స్ ఏర్పాటు చేసుకునేవారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్

విశాలాంధ్ర - పెద్దాపురం : మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. గురువారం స్థానిక మట్టే ఆదినారాయణ అగ్రవర్ణ సేవా సంఘ భవనంలో నిర్వహించిన ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్, స్టౌలు పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్త్రీ క్షేమంగా ఉంటేనే మన సమాజం క్షేమంగా ఉంటుందని అనే ఉద్దేశంతో ఈలాంటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అదే విధంగా స్త్రీ మహిళకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించారని అన్నారు. అనంతరం మహిళలకు గ్యాస్ స్టవ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పోలవరపు సత్తిబాబు, నూనె రామ రావు, కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, తాతాబత్తుల సాయి, ఆరిఫ్ అలీ, గెద్దం పెదబాబు, జనసేన నాయకులు వంగలపూడి సతీష్, నాగేంద్ర బాబు, కాసులపల్లి వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రుల విస్తరణకు కేంద్రం చర్యలు

### - ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలో నానాటికి పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దేశంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో దశలవారీగా క్యాన్సర్ ఆసుపత్రులను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పబ్లిక్ గ్రీవెన్స్, ప్రధాని కార్యాలయ శాఖ మంత్రి డా జితేంద్ర సింగ్ తెలిపారు. దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ ఆసుపత్రుల నిర్మాణం, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై గురువారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ) భాగస్వామ్యంతో దేశంలో పలు ప్రాంతాల్లో క్యాన్సర్ ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖలో హోమీ భాభా కేన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ ఇప్పటికే పూర్తిస్థాయి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా సేవలందిస్తుందని తెలిపారు. 2022లో రూ.556.58 కోట్ల వ్యయంతో అణుశక్తి శాఖ ద్వారా టాటా మెమోరియల్ సెంటర్ నెలకొల్పిన ఈ ఆసుపత్రిలో ఆధునాతన క్యాన్సర్ వైద్య సేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో ఆసుపత్రిని మరింత విస్తరించే ప్రతిపాదన ఉందన్నారు. ఏపీలో రంగరాయ వైద్య కళాశాలతో పాటు మరో 18 ప్రభుత్వ, ప్రైవేటు కేన్సర్ ఆసుపత్రులు నేషనల్ కేన్సర్ గ్రిడ్ కింద రిజిస్టర్ అయ్యాయని కేంద్ర మంత్రి వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తాం

విశాలాంధ్ర - కరప : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు, వ్యాపారం సులభతరం చేయడానికి ఎంఎస్ఎంఈ అన్ని ఉద్యమ రిజిస్ట్రేషన్ అనబడే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వీలు కల్పిస్తున్నదని జిల్లా జాయింట్ డైరెక్టర్ ఇండస్ట్రీస్ అధికారి సిహెచ్ గణపతి పేర్కొన్నారు. గురువారం స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో కరప గ్రామంలో ఉద్యమ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనాధ్రైజుడ్ ఉన్న ర్యాప్, స్కీం అన్నింటిని కలిపి తొమ్మిది కాంపోనెంట్స్ ఉన్నాయని, డిఆర్‌డిఏతో సంయుక్తంగా పనిచేయడం జరుగుతుందన్నారు. చేతివృత్తులు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్‌లు, సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, ఎగుమతి రంగాలు, విద్య, గృహాలు పునరుత్పత్తి రంగం, ఎంఎస్ ఎంఈ, పరిశ్రమలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఏ సమస్య కైనా ఒకటికి మించి ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు ఆధార్ నెంబర్, పాన్ జీఎస్టీలో తప్పనిసరి అన్నారు. దీని ద్వారా బ్యాంకుల నుండి రుణాలు పొందడానికి అర్హత ఉంటుందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు అనుసరించి ఎంఎస్ఎంఈలకు అన్ని బ్యాంకులు అందించే రుణాలు నిబంధనలకు లోబడి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం విజయలక్ష్మి, కరప మండల ఏపిఎం సత్యవతి, డిఆర్‌ఓలు పాల్గొన్నారు.

## దాళ్వా సాగుకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

### - డీసీ చైర్మన్ సత్యనారాయణ

విశాలాంధ్ర - కరప : కరప మండలం కరప, అరట్లకట్ట, గొర్రిపూడి పాలెం, జడ్ల బావవరం గ్రామాలకు శుభపురం అక్విడెక్ట్ నుంచి పారే కాలువల పనులు శుక్రవారం ప్రారంభిస్తామని కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పుణ్యమంతుల గంగాసత్యనారాయణ (బీజీ) తెలిపారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులతో డిసెంబర్ 11న ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దాళ్వా సాగుకు ఎక్కడా నీటి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ఒక్క ఎకరాకు కూడా నీటి సమస్య లేకుండా రైతులకు అందేలా కాలువల తవ్వకాలు, గుర్రపుడెక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. నీటి సంఘాలు, అధికారుల సమిష్టిగా పనిచేసి సాగుకు ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే నానాజీ జనసేన నాయకులకు ఆదేశించారు. మండల పరిధిలో పంట కాలువలు, డ్రైన్లు గత వేసవిలో సరిగా లేకపోవడం ముఖ్యంగా మాదేశ్వరం శుభపురం అక్విడెక్ట్ నుండి పై గ్రామాలకు నీరు సరిగా రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు అడ్డుకుని యిచ్చారు కొరత, బీడీ బారి భూములకు నీరు రాకపోవడం మీద రాజకీయాలు చేస్తున్నారని నీటి సంఘ అధ్యక్షులు పీజీ సత్యనారాయణ ఆరోపించారు. గత ప్రభుత్వంలో, ఇప్పుడు ఏమి చేస్తున్నాం, ఏమి జరుగుతోందో రైతులు అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళి, కరప మండల వైస్ ఎంపీపీ మెర్ల వీర వెంకట ప్రభాకర్ చౌదరి (చిన్న బాబు), జడ్ బావవరం సొసైటీ వైస్ చైర్మన్ గంట వీరన్న చౌదరి, అరట్లకట్ట జనసేన గ్రామ అధ్యక్షులు బత్తుల సతీష్, గొర్రిపూడి పాలెం గ్రామ అధ్యక్షులు వీరమరెడ్డి ముత్యాలరావు, పంతుల సతీష్, నిమ్మకాయల సత్తిబాబు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# విశాలాంధ్ర గోదావరి కాకినాడ జిల్లా

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పిఠాపురం : దున్నేవాడిదే భూమి కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతం అని, కానీ దోచేవాడిదే భూమి అనేది కబ్జాదారుల హవా అన్నట్టుగా పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జరుగుతోందని సీపీఐ నాయకుడు సాకా రామకృష్ణ ఆరోపించారు. పిఠాపురం శివారులో 257 సర్వే నెంబర్ 62 సెంట్లు ప్రభుత్వభూమి కబ్జాకు గురవుతోందని, కబ్జాదారులు పై చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకుడు సాకా రామకృష్ణ, కార్యకర్తలతో కలిసి తాసిల్దార్‌కి ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రి సత్తిబాబు, కేత రమణ, చెరుకూరి గణపతి, మేకల నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఒక మాట ... తర్వాత ఒక బాట

- మెడికల్ కళాశాలలో పిపిపి రద్దు చేసే వరకు సీపీఐ ఉద్యమం ఆగదు
- అప్పులు ప్రజలకా...! సంపద కార్పొరేట్ వ్యక్తులకా
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కాకినాడలో సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ బాబు మెడికల్ కాలేజీ సీట్లు పై అనేక మాటలు చెప్పారని జగన్ మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నారని లోకేష్ బాబు ఆరోపించారని నేడు అధికారంలోకి రాగానే మొత్తం మెడికల్ కాలేజీలను అమ్మి వేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మెడికల్ కళాశాలల ప్రైవేటు కరణను నిరసిస్తూ సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం :590 తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాలలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ ఆపాలి వైద్య విద్య కళాశాలలను పిపిపి విధానంలో ఏర్పాటు చేయడం ద్వారా రూ.3,700 కోట్ల అభివృద్ధి ఖర్చు, ఏటా రూ.500 కోట్ల నిర్వహణావ్యయం ఆదా అవుతుందంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవానికి ఈ విధానం దీర్ఘకాలికంగా రాష్ట్రానికి నష్టం కలిగిస్తుంది. సుమారు 60 ఏళ్లపాటు ప్రభుత్వ భూమి, వనరులు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లి, వారికి ఆదాయవనరులుగా మారతాయి. వైద్య విద్య పూర్తిగా వ్యాపారవరమవుతుంది. మేనేజ్మెంట్ కోటా ద్వారా ఇచ్చే 25% సీట్లు (375) ఒక్కో సీటుకు దాదాపు రూ.50 నుండి 60 లక్షల వరకు వసూలు చేసే అవకాశం ఉంది. ఈ అధిక ఫీజు కారణంగా పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు పూర్తిగా దూరమవుతారు. ప్రైవేటు సంస్థల లాభాపేక్ష వల్ల వైద్య సేవల్లో నాణ్యత తగ్గడంతోపాటు, పేదవారికి ఉచిత వైద్య సేవలు అందని ద్రాక్షగా మారతాయి. పిపిపి విధానం కారణంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యుఎస్ వర్గాలు సుమారు 55% వైద్య విద్య సీట్లను కోల్పోవడమే కాకుండా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు రిజర్వేషన్ వర్తించేటువంటి 3,675 ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోయే పరిస్థితి ఎదురవుతుంది. నాబార్డ్ నిధులను వినియోగించి నిర్మించే వైద్య విద్య కళాశాలలను పిపిపి విధానంలో కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా కట్టబెట్టడాన్ని ఉపసంహరించుకోవాలి. విద్య, వైద్యం అనేవి ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ప్రజలకు మేలు జరుగుతుంది, పేదల ఆరోగ్య సంరక్షణపట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా స్పందించి తక్షణమే జీవో నెం. 590 రద్దు చేయాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్ పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించే ప్రక్రియను రద్దు చేయాలి. రాష్ట్రంలోని పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు మేలుచేకూర్చేలా 10 నూతన మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాక రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు రామయ్య, అనిల్, మధు కాట్ రాజు, కిషోర్, శ్రీను, ఆనంద రావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మ అక్క, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాబీ, జిల్లా సమితి సభ్యులు పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

## కాటన్ గోదావరి ట్రోఫీ పడవ పోటీలకు సన్నద్ధం కావాలి

### - ఎమ్మెల్యే సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కేరళ పడవ పోటీలను తలపించేలా ఆత్రేయపురంలో నిర్వహించనున్న సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సంసిద్ధంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది నిర్వహించే గోదావరి ట్రోఫీ పడవ పోటీలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల ఏర్పాట్లపై పలు కీలక సూచనలు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కమిటీతో పాటు ప్రభుత్వం కలిసి ఈ సంబరాలను సమన్వయంతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డ్రాగన్ పడవ పోటీలు, ఈతల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి ఆకర్షణీయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సినీ ఆర్కెస్ట్రా వంటి వినోద కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. పర్యాటకానికి అనువైన మన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు సంబరాలతో మరేకం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. "మన ఊరు-మన పండుగ-మన సంబరాలు" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

## గ్రంథాలయ సంస్థ సిబ్బంది సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతి రాజు ఈశ్వర రాజువర్మ (సాయిబాబు రాజు)ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం (31/2017) కార్యవర్గం సంఘం అధ్యక్షులు జివిఆర్ ఎస్ హెచ్ కే వర్మ ఆధ్వర్యంలో మామిడి కుదురు, గోగన్నమఠం గ్రామంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు, గ్రంథాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సలాది సాయి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు రేపాక వెంకట రామ, కోశాధికారి జివిఎస్ శ్రీధర్, ప్రచార కార్యదర్శి ములంపాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కే కిషోర్, కే శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కే పద్మజ, బి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా జె నరసింహ నాయక్ వైద్యాధికారులకు సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా జె నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమం పై పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, సిబ్బందికి, యుపిహెచ్‌సి రామారావుపేటలో సన్నద్ధత పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా జె నరసింహనాయక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని తెలియజేసారు. ముందురోజు అనగా శనివారం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, వొలంటీర్లతో ర్యాలీ ప్రదర్శనతో అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు అందరికి మొదటి రోజు పోలియో బూత్‌ లోనే నూరు శాతం పూర్తి చేయాలని, రెండవ, మూడవ రోజుల్లో సిబ్బంది గృహాల సందర్శన ద్వారా మిస్సింగ్ పిల్లలను గుర్తించి వెంటనే పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ప్రతీ పోలియో బూత్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ తెరచి ఉంచాలని, వాక్సిన్ వేసే ముందు వివి యందు తప్పనిసరిగా గమనించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐవో డా కె వి సుబ్బరాజు, డియంవో డా ఐ ప్రభాకర్, యుహెచ్‌వో డా పృథ్వీ చరణ్, డిప్యూటీ డెమో కె సూర్యచంద్రరావు, పట్టణ ఆరోగ్య కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హై టెన్షన్‌లో గొల్లప్రోలు

### హిందు సంఘాలతో చర్చలు విఫలం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకుంది. గత వారం రోజులుగా గొల్లప్రోలు పట్టణంలో కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా అన్యమత ప్రచారం జరుగుతుందని హిందూ సంఘాలు, చుట్టు ప్రక్క స్థానికులు మరోసారి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గత వారం పోలీస్ బందోబస్తుతో చర్చలు దగ్గర ఉండి నిర్వహించడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. తక్షణమే తహసీల్దార్ స్పందించి హిందువుల మనోభావాలు దెబ్బ తీయకుండా సమన్యాయం చేయాలని కోరారు. ఆర్డీఓ కానీ, కలెక్టర్ కానీ వచ్చి సమస్యకు పరిష్కారం చూపేవరకు కదిలేది లేదని, భక్తి గీతాలతో ధర్నా నిర్వహించారు. పిఠాపురం సిఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మిషన్ మౌసమ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత

- తుఫాన్లపై ముందస్తు హెచ్చరికల బలోపేతానికి కేంద్రం చర్యలు
- ఎంపీ సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - కాకినాడ : రాజ్యసభలో సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర భూవిజ్ఞానశాస్త్రాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఇచ్చిన సమాధానంలో, మిషన్ మౌసమ్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 47 డాప్లర్ వాతావరణ రాడార్లు పనిచేస్తున్నాయని, వాటిలో మచిలీపట్నం, విశాఖపట్నం, శ్రీహరికోటలో మూడు రాడార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇవి తుఫానులు, భారీ వర్షాలు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ముందుగా గుర్తించి హెచ్చరికలు జారీ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని రాడార్ల ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా తుఫానుకు గురయ్యే తీర ప్రాంతాలు, అధిక జనాభా గల నగరాలు, వాతావరణ ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ తీర రాష్ట్రాల భూభౌగోళిక ప్రమాద ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇంకా, రేడియో మీటర్లు, విండ్ ప్రొఫైలర్లు వంటి పరికరాలను కూడా భవిష్యత్తులో ముఖ్య విమానాశ్రయాలు, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం దేశ భూభాగంలో సుమారు 87% ప్రాంతాన్ని రాడార్ కవరేజ్ కిందకు తీసుకు వచ్చినట్లు కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాలను కవర్ చేయడానికి గ్యాప్ అనాలిసిస్ చేపట్టినట్లు తెలిపింది. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు మెరుగుపడటం వల్ల ప్రకృతి విపత్తుల పై ప్రభుత్వ స్పందన వేగవంతం అవుతుంది. -తీర ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు తోడ్పాటు. -రైతులకు, మత్స్య కారులకు వాతావరణ సమాచారం అందు బాటులోకి వస్తుంది ప్రమాదాల నుంచి రక్షించడంలో కీలకంగా నిలుస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

## రెండో అదనపు పిపిగా ఆడపా సత్యప్రసాద్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆడపా సత్యప్రసాద్‌ను రెండవ అదనపు జిల్లా ఎడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించినట్లు ప్రభుత్వం నుండి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేసుల విచారణలో ఆయనకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కేసుల పురోగతి మరింత ముందుకు వెళుతుందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. ఆయనకు పట్టణానికి చెందిన న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

## ఏసీబీ దాడి

### లంచం కేసులో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సహా ముగ్గురు అరెస్టు

విశాలాంధ్ర - కాకినాడ : కుటుంబ పెన్షన్ ఖరారు, కారుణ్య నియామకం కోసం లంచం డిమాండ్ చేసి స్వీకరించిన కేసులో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సహా ముగ్గురు అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు అగ్రహారం గ్రామానికి చెందిన గెద్దాడ చక్రవర్తి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఫిర్యాదుదారు తండ్రి గెద్దాడ అంబేద్కర్ గత జూలై 23న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఐ పోలవరం మండలంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో కుక్‌గా పనిచేశారు. ఆయన మృతిచెందిన అనంతరం కుటుంబ పెన్షన్ ఖరారు చేయడం, ఫిర్యాదుదారుని సోదరుడు గెద్దాడి ధర్మతేజకు కారుణ్య నియామకం కల్పించేందుకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, సీనియర్ అసిస్టెంట్ కార్పు ఎస్.వి.ఎస్ ప్రసాద్ కలిసి రూ.60 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అందులో మొదట రూ.40వేలు ఇవ్వాలని కోరారు. లంచం ఇవ్వడానికి నిరాకరించిన ఫిర్యాదుదారు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, గురువారం కాకినాడలోని జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో ప్రైవేట్ మధ్యవర్తిగా వ్యవహరించిన రిటైర్డ్ ఉద్యోగి యాదల సత్యనారాయణ ద్వారా రూ.40 వేల లంచం తీసుకుంటున్న సమయంలో ముగ్గురిని ఏసీబీ అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. అరెస్టు చేసిన వారిని రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. అవినీతికి సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 94404 40057, తెలిపాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు.

## వీరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ళ గ్రామంలోని ప్రసిద్ధిగాంచిన వీరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం కూటమి ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టనున్న పనులపై ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక ప్రణాళికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ప్రాంగణ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను ఆలయ అర్చకులు, సిబ్బందికి వివరించారు. ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
డా॥ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

## రైల్వే అధికారులను కలిసిన కోనసీమ జేఏసి కన్వీనర్



**విశాలాంధ్ర - అమలాపురం :** కోనసీమ జేఏసి కన్వీనర్ బండారు రామమోహనరావు గుంటూరులో రైల్వే డిప్యూటీ సీఈ(కన్స్ట్రక్షన్) కార్యాలయంను సందర్శించి కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ ప్రగతి పై ఆరా తీశారు. గత సంవత్సరకాలంగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎటువంటి పనులు జరగకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కోటిపల్లి-నర్సాపురం ప్రాజెక్ట్ సంబంధిత అధికారి గోవింద్ స్పందిస్తూ..కన్వీనర్ అడిగిన అంశాలకు సంబంధించి ఈ క్రింది విధంగా వివరణ ఇచ్చారు. కోటిపల్లి గౌతమీ నది పిల్లర్స్ పై గుడ్డర్లు వేయడానికి టెండర్ దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు, రైల్వేవర్గాలు మధ్య కోర్టు కేసు నడుస్తున్న కారణంగా అక్కడ పనులు ప్రారంభంకాలేదు. అక్కడ గుడ్డర్లు ప్రక్రియ ప్రారంభం కావడానికి ఇంకా టైమ్ పడుతుంది. దిండి వశిష్ఠ నది వద్ద మునిగిపోయిన ఒక పిల్లర్‌ను నిలబెట్టే పనులు లేదా ప్రత్యామ్నాయ పనులు సంక్రాంతి తర్వాత ప్రారంభం అవుతాయి. బోడసకురు వైనతేయ, చించినాడ వశిష్ఠ నదుల పిల్లర్స్ పై వేసే గుడ్డర్లు నిర్మాణ పనులు ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల రైల్వే వర్క్ షాప్‌లో ప్రారంభం అయినాయి. ఇక రైల్వే ట్రాక్ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి ఎప్పుడు భూమిని అప్పచెబితే అప్పటి నుంచి పనులు ప్రారంభం చేయడానికి రైల్వే వర్గాలు సిద్ధంగా ఉన్నాయి.

## టేబుల్ టెన్నిస్‌లో కిమ్స్ విద్యార్థినికి పతకాల పంట

మూడు పతకాలు గెలిచిన కిమ్స్ విద్యార్థిని

**విశాలాంధ్ర - అమలాపురం :** విశాఖ పట్టణంలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపి, కిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థిని పతకాల పంట పండించింది. కిమ్స్ డాక్టర్ నిత్యాల పెద్దిరెడ్డి మూడు విభాగాలలో బహుమతులు గెలుచుకుంది. మహిళల సింగిల్స్‌లో తృతీయ, డబుల్స్‌లో ద్వితీయ, మిక్స్ డబుల్స్‌లో తృతీయ బహుమతులను గెలుచుకున్నారని అని కిమ్స్ డీన్ డా ఆనంద్ ఆచార్య తెలిపారు. కిమ్స్ మెడికల్ కాలేజీలో విద్యార్థులకు విద్యతో పాటు ఆటలలో కూడా ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తున్నామని, శారీరక ఆరోగ్యం మానసిక ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుందని ఆయన తెలిపారు. టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన డా నిత్యాల రెడ్డిని ప్రోత్సహించిన కిమ్స్ వ్యాయామ ఉపాధ్యాయులను కిమ్స్ చైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు, కిమ్స్ ఎండి రవి కిరణ్ వర్మ అభినందించారు.

## మాజీ ఎంపీ కృష్ణమూర్తికి జడ్పీ చైర్మన్ నివాళి

**విశాలాంధ్ర - అమలాపురం :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి చిత్ర పటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలకృష్ణ, అయినవిల్లి మండలం శానపల్లి లంక ఎంపీటీసీ పచ్చిమాల సుబ్బారావు మరియు విలస సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్ సునీల్ కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ ఉండ్రు వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారుడు రాజ్ కృష్ణ, కుమార్తె కృష్ణ సుభలను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## స్త్రీశక్తి పథకంలో సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### - ప్రధాన కార్యదర్శి కేఎస్‌పి రావు

**విశాలాంధ్ర - రావులపాలెం :** ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళా ప్రయాణీకులకు ఎదురవుతున్న సమస్యలు, సిబ్బంది పై పెరిగిన పని భారాలు తక్షణ పరిష్కారం కోరుతూ గురువారం యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రావులపాలెం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కేఎస్‌పి రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుకు ముందే ఆర్టీసీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ పథకం అమల వుతున్న వివిధరాష్ట్రాల పర్యటనకు వెళ్లి అధ్యయనం చేసి వచ్చారని, డిమాండ్ ఏ మేరకు పెరగబోతున్నదో ముందస్తు అంచనాలు రూపొందించడం జరిగింది కానీ బస్సులను మాత్రం పెంచకుండా స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవ్వడమే కాక ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. అలాగే తక్షణం బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్ని బస్సులకు హైడ్రాలిక్ డోర్స్ ఏర్పాటు చేసి మహిళా ప్రయాణీకులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి చిన్నారావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కోసం ప్రభుత్వం 75 రోజులకు 400 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వు విడుదల చేసిందని అంటే నెలకు సుమారు 160 కోట్ల రూపాయలని తెలుస్తుందని అందువలన కొట్టిన ప్రతి టికెట్‌కు ప్రభుత్వం లెక్క కట్టి ఇవ్వడం లేదన్న సంగతి తెలుస్తుందని తెలియచేశారు. వెంట వెంటనే డబ్బుల టికెట్లు, స్త్రీశక్తి(0) టికెట్‌లు ఇవ్వడం వల్ల కండక్టర్లకు ఎక్కువగా పొరపాట్లు జరుగుతున్నాయని వాటివల్ల కండక్టర్లకు ఉద్యోగభద్రత ముప్పు వాటిల్లందని తెలియాచేస్తూ కావున రెండు రకాల టికెట్లు ఇచ్చే విధానం తీసివేసి డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే టికెట్ ఇచ్చేలా నిబంధన మార్చాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు ఏఎస్ నారాయణ మాట్లాడుతూ ఉచిత బస్సు పథకానికి ఏ విధమైన అదనపు ఏర్పాట్లు చేయకుండా అమలు చేయడం వల్ల జరుగుతున్న జాప్యానికి, అసౌకర్యానికి ప్రయాణీకులు అసహనానికి లోనవుతున్నారు. వారి అసహనం ప్రదర్శనకు విధులలో ఉన్న సిబ్బంది ఎరగా మరి దాడులకు గురవుతున్నారు. ప్రయాణీకులకు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం బస్సుల్లో ఏర్పాట్లు చేసి 70 మందిని మాత్రమే ప్రయాణీకులను అనుమతించేలా నిబంధనలు మార్చాలని, విధులలో ఈ ఉన్న సిబ్బంది పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం బియన్‌యస్ 109 కేసు మోపి శిక్షించాలని, దాడికి గురైన సిబ్బంది తిరిగి విధుల్లో చేరే వరకు ఆన్ డ్యూటీగా పరిగణించాలని, తక్షణ వైద్యం కొరకు కార్పోరేట్ వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెఎస్‌పి రావు, ఏఎస్ నారాయణ అలాగే 30 మంది కార్మికులు, ఏకే స్వామి, రాంబాబు, బుజ్జి, బూరమ్మ, నాగలక్ష్మి, కెఎల్ఎస్ నారాయణ, ఆదిత్య, లాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మేథోసంపత్తిని కలిగి ఉండాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి

**విశాలాంధ్ర - ఐ పోలవరం :** విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ద్వారా విద్యార్థులు మేథోసంపత్తికి పదును పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్ డిఈఓ ఆవిష్కరించారు. జడ్పీహెచ్ఎస్ జి వేమవరం ఐ పోలవరం మండల స్థాయి లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు జిల్లా విద్యాశాఖ అధికారి పి నాగేశ్వరావు, జిల్లా సైన్స్ అధికారి జి సుబ్రమణ్యం, డిసిబి సెక్రెటరీ బి హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారీ నల్లమిల్లి కొండారెడ్డి మండల విద్యాశాఖ అధికారి. 2 వీధి సురేష్ బాబు, జి వేమవరం గ్రామ సొసైటీ అధ్యక్షులు పెంట రవి ప్రసాద్, గ్రామ సర్పంచ్ నల్ల సుదర్శన్‌రావు ఎంపీటీసీ సభ్యులు చోడిశెట్టి జ్యోతి నాయుడు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బసవ అప్పారావు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు వారణా సుభద్ర లక్ష్మీదేవి, మండల సైన్స్ ఆఫీసర్ వరద శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంనకు మండలంలోని 11 ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల నుండి విద్యార్థులు సుమారుగా 100 ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగినది. ప్రదర్శించిన ప్రాజెక్టులో థీమ్ లవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందచేశారు. మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి న్యాయం నేతలుగా కీర్తిశేషులు వేగిరాజు వెంకటనారాయణ, జూనియర్ కాలేజ్ ఐ పోల వరంలో పి వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి న్యాయ నేతలుగా వ్యవహరించారు. అనంతరం జి మూలపాలెం జడ్పీ హైస్కూల్ను విద్యాశాఖ అధికారులు సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ప్రగతిని విద్యా ప్రమాణాలు గురించి అడిగి తెలుసుకున్నారు. 100 రోజులు యాక్షన్ ప్లాన్ అమలు పర్యవేక్షించారు. పదోతరగతి విద్యార్థులకు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతకు సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీఎస్‌జి మూలపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజన పథకం రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు 75 రోజులు జిఎఫ్ఎల్ ఎన్ యాక్షన్ ప్లాన్ అమలును పరిశీలించారు.

## ప్రైవేటుకు వ్యతిరేకంగా కోటి దాటిన సంతకాలు

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంకు వ్యతిరేకంగా వైసిపి అధినేత జగన్ ఆదేశాలతో చేపట్టిన సంతకాల సేకరణ కోటి దాటిందని ప్రైవేటీకరణ పై ప్రజల అభిప్రాయాలు సంతకాల ద్వారా చెప్పారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్రం కార్యాలయం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో కోటి సంతకాల ప్రతులు లోక్ భవన్‌కు పంపించే కార్యక్రమం విజయవంతంగా గవర్నర్‌కు అందజేసే కార్యక్రమం అధినేత జగన్‌తో కలిసి పాల్గొనట్టు మురళి రాజు తెలిపారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : సీపీఐ డిమాండ్

**విశాలాంధ్ర - అమలాపురం :** పిపిపి పద్ధతిలో నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న జిఓ 590 రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమితి ఆధ్వర్యంలో అమలాపురం మెడికల్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలకు మెడికల్ విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం నేడు జిఓ 590 తీసుకోవచ్చి గత ప్రభుత్వం తీసుకువచ్చిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ రంగం వారికి అప్పచెప్పడం భారత కమ్యూనిస్టు పార్టీ ఖండిస్తుంది, మన రాష్ట్రంలో పేదలకు ఉచిత వైద్యం చేయాలి, వైద్య విద్య ను అభ్యసించాలని పేద వారి కోరికలను కలలను దూరం చేసి వైద్యం అమ్ముకునే కార్పొరేట్ వైద్యులను తయారుచేయడం కోసం కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్తుంది, 66 సంవత్సరాలు లీజుకి ఇచ్చి, నిర్వహణ బాధ్యతలు వారికి ఇస్తే వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టి ఉచితంగా విద్య, వైద్యం అందిస్తారని ప్రజలను మభ్యపెట్టాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కి 22000 కోట్ల రూపాయలు రాయితీలు, కంపెనీలకు 99 పైసలకు వేల ఎకరాలు ఇవ్వగలిగిన వాళ్ళు 5000 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీలు కట్టలేము, నిర్వహించలేదు అనడం కూటమి ప్రభుత్వం చేతకాని తనం అనాలా లేక కార్పొరేట్ వారికి దాసోహం అనాలా, పిపిపి విధానం ఏ రాష్ట్రంలో కూడా విజయవంతం అవ్వలేదని గతం మర్చిపోవద్దని, ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సత్తిబాబు మాట్లాడుతూ ఇది ప్రజా ఉద్యమం, ప్రజా గొంతుగా సీపీఐ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. పక్క రాష్ట్రాలు తమిళనాడు, కేరళలో గత ప్రభుత్వాలు చేసే ప్రజా ప్రయోజన కార్యక్రమాలు, పథకాలు ప్రస్తుత ప్రభుత్వాలు ముందుకు తీసుకువెళ్తున్నాయని, ప్రజల సొమ్మును వ్యర్థం చేయకుండా కూటమి ప్రభుత్వం కూడా మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వమే చేపట్టి ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత విద్యను అందించాలని కోరుతున్నాము అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, శీలం వెంకటేష్, రామకృష్ణ, తాతాజీ, రవికుమార్, సమితి సభ్యులు చిట్టూరి ప్రసాద్, చిట్టూరి సత్యనారాయణ, గుత్తి నాగేశ్వరరావు, ఆనంద్, ప్రేమానందం, తాడి సత్యనారాయణ, భీమరాజు, నాగబాబు, వెంకట్ పాల్గొన్నారు.

## శత వసంతాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్

**విశాలాంధ్ర - ముమ్మిడివరం :** సీపీఐ ముమ్మిడివరం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం యడ్ల అరుణ అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ప్రజానాట్య మండలి నాయకులు ప్రేమానందం అభ్యుదయ గేయాలు పాడి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ సమావేశం ఆరంభించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ శత వసంతాల చరిత్రలో శ్రమ జీవుల హక్కుల కోసం ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టు నాయకుల జీవితాల్ని ఆదర్శంగా తీసుకొని పార్టీ నేటికి 100 ఏళ్ళుగా ప్రజా పోరాటంలో నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాటం చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని అలాగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో కమ్యూనిస్టులు చనిపోయారని అన్నారు. ప్రజా సంక్షేమ చట్టాలు ఎన్నో రూపొందించడంలో సీపీఐ అప్పటి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని ఒప్పించి చట్టాలు చేశారు. అందులో ప్రధానంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం దాని ద్వారా ఎందరో పేదలకు ప్రభుత్వం ద్వారా పని కల్పించారు. నేడు కేంద్ర ప్రభుత్వం బీజేపీ ఎన్ఆర్ఈజి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని మొదటగా మహాత్మాగాంధీ పేరుని తీసివేశారు. అలాగే కేంద్రం నుండి 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు ఇవ్వాలని చెప్తుంది. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం జరిగింది. కానీ వారి దినసరి వేతనాలు పెంచలేదు, చట్టాన్ని నిర్వీర్యం చేసి రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన అని దీనికి నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 125 కాదు 200 రోజులు పనులు కల్పించాలని, కనీస వేతనాలు 500 రూపాయలకు పెంచాలని ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతుంది. అలాగే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్పడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించామని అన్నారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం నేడు ఒకరికి కూడా ఇళ్ల స్థలం కేటాయించలేదని అబద్ధపు హామీలతో అధికారం లోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. బడుగు, బలహీన, శ్రామిక వర్గ ప్రజల పక్షాన నిలబడింది భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అని అన్నారు. సిపిఐ శత వసంతాల వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా సమావేశంలో పాల్గొన్న మహిళలు అందరికీ ముమ్మిడివరం సీపీఐ శాఖ తరఫున చీరలు ఇచ్చి గౌరవించారు. ముమ్మిడివరం నియోజకవర్గం కార్యదర్శి వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, రామకృష్ణ, రవి కుమార్, రాజోలు నాయకులు తాడి సత్యనారాయణ, మహిళా సమాఖ్య సభ్యులు అరుణ, ఎందరో మహిళలు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌లకు 20 సీల్డ్ టెండర్‌లు

**విశాలాంధ్ర - అమలాపురం రూరల్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4 సెమీ మెకానిజడ్ ఇసుక రీచులలో ఇసుక త్రవ్వకాలు, లోడింగు నిల్వ కేంద్రాలు ఏర్పాటుకు జిల్లా స్థాయి కమిటీ టెండర్లు షీల్డ్ పిలువగా 20 మంది సీల్డ్ టెండర్లు దాఖలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి వెల్లడించారు. గురువారం సీల్ టెండర్లు తెరిచి ఫైనలైజేషన్ చేయగా ఆలమూరు మండలం జొన్నాడ సెమీ మెకానిజం రీచ్‌కు ఆర్ఎస్ఆర్ ఇన్ఫ్రా కంపెనీ వారు సీల్ టెండర్‌ను దక్కించుకున్నారని, అదేవిధంగా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం సెమీ మెకానైజ్డ్ రీచ్‌ను సుంకర ఇన్ఫ్రా కంపెనీ దక్కించుకోగా ఆలమూరు మండలం ఆలమూరు సెమీ మెకానైజ్డ్ రీచ్‌ను కూడా సుంకర ఇన్ఫ్రా కంపెనీ వారు దక్కించుకోగా, కపిలేశ్వరపురం సెమీ మెకానేజ్ రీచ్‌ను జిఎస్ఆర్ ఇన్ఫ్రా కంపెనీ వారు సీల్డ్ టెండర్ల ద్వారా దక్కించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సెమీ మెకానిజడ్ రీచ్ ఒక సంవత్సరం కాలం పాటు ఇసుక తవ్వకాలకు గాను గడువులను విధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ కనుల శాఖ సహాయ సంచాలకులు ఎల్ వంశీధర్ రెడ్డి డ్వామా ఏపీడి డి రాంబాబు, జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు, గోదావరి హెడ్ వర్క్స్ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, జిల్లా సబ్ రిజిస్టర్ ఏవివి సత్యనారాయణ, ఆడిట్ అధికారి మురళీకృష్ణ, రియాల్టీ ఇన్స్పెక్టర్ పి సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో సరికొత్త విప్లవం

### - కోడిపందేలకు బదులు బాక్సింగ్ వైపు కోనసీమ యువత

**విశాలాంధ్ర - అమలాపురం :** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి రైతుల పండుగగా, సంస్కృతీ సంప్రదాయాల కలయికగా జరుపుకునే ఈ వేడుక కాలక్రమేణా దారి తప్పి, జూదం, మద్యం, కోడి పందాల వంటి సామాజిక రుగ్మతలకు వేదికగా మారుతోంది. ముఖ్యంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సుమారు 5 నుండి 7 లక్షల మంది యువత ఈ వ్యసనాల బారిన పడి తమ ఆర్థిక స్థితిని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు 'రెస్పాన్సిబుల్ యూత్ ఫోర్స్' (ఆర్‌వైఎఫ్) ఒక వినూత్న ప్రత్యామ్నాయంతో ముందుకు వచ్చింది. చట్టం -సామాజిక బాధ్యత కోడి పందాలు, జూదం వంటివి జంతువుల పట్ల క్రూరత్వ నివారణ చట్ట ప్రకారం (1960), ఆంధ్రప్రదేశ్ క్రీడా చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరాలు. ఈ చట్టాల ప్రకారం జరిమానాతో పాటు 3 నుండి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అయినప్పటికీ, రాజకీయ ప్రభావం వల్ల ఈ అరాచకాలు సాగుతూనే ఉన్నాయి. దీనివల్ల యువత క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును కోల్పోతున్నారు. బెట్టింగ్ వద్దు.. బాక్సింగ్ ముద్దు అనే నినాదంతో ఆర్‌వైఎఫ్ పిలుపు యువతలోని శారీరక శక్తిని, ఉత్సాహాన్ని వ్యసనాల వైపు కాకుండా దేశానికి గర్వకారణంగా మార్చేందుకు హైకోర్టు యువ న్యాయవాది శెట్టిబత్తుల సుభాష్ నేతృత్వంలో 'రెస్పాన్సిబుల్ యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) బాక్సింగ్ క్లబ్' ఏర్పాటయింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13, 14, 15 తేదీలలో చట్టవిరుద్ధమైన పందాలకు బదులుగా వృత్తి పరమైన బాక్సింగ్ పోటీలను నిర్వహించే కార్యక్రమం 'పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ (పిఎస్ఓ)' 'జెబిఎస్ బాక్సింగ్ క్లబ్' సమన్వయంతో ఎస్ యానాం గ్రామంలో 'ఆంధ్రా-గోవా' పేరుతో అంతర్జాతీయ స్థాయి బాక్సింగ్ ఈవెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భవిష్యత్తు కోనసీమ యువతను ఒలింపిక్స్ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ఈ సంస్థ ప్రధాన ధ్యేయం.

దీనిపై కలెక్టర్‌కు వినతి-దాతల సహకారం ఈ పోటీల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఇప్పటికే జిల్లా కలెక్టరుకు, స్పోర్ట్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ఎన్ మౌర్య సింగ్, పిఎస్ఓ అధినేత వెంకట్ భాగస్వాములుగా ఉన్నారని. ఈ కార్యక్రమానికి అండగా నిలవాలనుకునే దాతలు (80)జీ టాక్స్ ఎక్సెప్షన్ సౌకర్యంతో) ముందుకు రావాలని, తద్వారా యువతను నేరాల బాట నుండి క్రీడల బాట మళ్లించడంలో తోడ్పడాలని ఆర్‌వైఎఫ్ కోరుతోంది. "సంక్రాంతి అంటే కేవలం వినోదం మాత్రమే కాదు, యువత సత్తాను చాటే వేదిక కావాలని బెట్టింగ్ బరిలో చితికిపోవడం కంటే బాక్సింగ్ రింగ్‌లో గెలవడం మిన్న" అని సుభాష్ పేర్కొన్నారు.

## గుత్తుల సాయిని కలసిన రాజోలు టీడీపీ నేతలు

**విశాలాంధ్ర - రాజోలు :** టీడీపీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన గుత్తుల సాయిని గురువారం రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్య కర్తలు అధిక సంఖ్యలో గాడిలంకలో ఉన్న సాయి నివాసం వద్దకు వెళ్లి దుస్సాలువాలు కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సాయి మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేస్తూ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో పార్టీ క్యాడరుని సమన్వయ పరిచి రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా చైర్మన్ శ్రీనివాస్, చాగంటి స్వామి, రాజోలు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వెంకటలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పద్మ, రాజోలు ఎంపీపీ దుర్గ, హెలీనా, మోకా పార్వతి, పాపయ్య రాజు, బొక్క గోవింద్, బొక్క పృధ్వి, మటపర్తి లక్ష్మి, కాండ్రేగుల భవానీ లావణ్య, అడబాల చంటి, పోతురాజు కృష్ణ, కడలి మోహన్, కసుకుర్తి త్రినాధ స్వామి, దొరబాబు, అడబాల విజయ్ పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలకు ఉద్యమ ఆధార్ తప్పనిసరి

**విశాలాంధ్ర - రామచంద్రపురం :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండల కేంద్రం మండల కేంద్రమైన స్త్రీ శక్తి కార్యాలయంలో డ్వాక్రా మహిళల గ్రూప్ సభ్యులకు ఏపీఎం టి రాము ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టి రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలకు రుణాలను పొందాలంటే ఉద్యమం ఆధార్ తప్పనిసరి అని తెలిపారు. డ్వాక్రా మహిళలకు గ్రూప్ సభ్యులకు ఉద్యమ ఆధర్ రిజిస్ట్రేషన్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పరిశ్రమ శాఖ ద్వారా సంయుక్తంగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. అదేవిధంగా చిన్న సూక్ష్మ మధ్యతః పరిశ్రమలను ప్రోత్సహించడమే, కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు, ఉద్యం ఆధార్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ ఉన్నవారికి బ్యాంకులు ద్వారా సులభంగా రుణాలు, తక్కువ వడ్డీరేట్లకు సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత లభిస్తుందని వివరించారు. డ్వాక్రా మహిళలు చిన్న వ్యాపారులు కుటీర పరిశ్రమలు ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఉద్యమ ఆధార ఒక ముఖ్యమైన ఆధారమని, ఆయన సూచించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకొని మహిళలు ముందుకు వచ్చి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్ జ్యోతి, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమ రిజిస్ట్రేషన్ 90 మంది చేసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించినందుకు అధికారులకు సిబ్బందికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు మహిళలు ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా టిడిపి అధ్యక్షునిగా గుత్తుల సాయి

**విశాలాంధ్ర - రావులపాలెం :** అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్య క్షునిగా గుత్తుల సాయిని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ నియమించడంతో అభి నందనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నలుమూలల నుండి టిడిపి కార్యకర్తలు అభిమానులు ముమ్మిడివరం నియోజక వర్గం గాడి లంక గ్రామం గుత్తుల సాయి స్వగ్రామానికి వెళ్లి నేరుగా అభినందనలు తెలుపుతున్నారు. అదే క్రమంలో గురు వారం కొత్తపేట నుండి టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి తదితరులు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన గుత్తుల సాయికి పదవి కేటాయించడం పట్ల బీసీ సామాజిక వర్గాలలో ఆనందం చోటుచేసుకుందని ఈ సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు గుబ్బల మూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. గుబ్బల మూర్తితో పాటు గుబ్బల వెంకటరమణ, దాట్ల బాబు, గుబ్బల సుబ్రహ్మణ్యం, కుడుపూడి శ్రీనివాస్, గుబ్బల నాగరాజు తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## వీఆర్ఓలకు బయోమెట్రిక్ హాజరు రద్దు చేయాలి

**విశాలాంధ్ర - రామచంద్రపురం :** గ్రామ, వార్డు, సచివాలయాలలో బయోమెట్రిక్ ప్రవేశపెట్టి, హాజరు ద్వారానే జీతాలు ఇస్తామనడాన్ని గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల విఆర్‌ఒల అధ్యక్షులు మద్దాల బాపూజీ ఒక ప్రకటనలో తెలియ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఒలు రెవిన్యూ శాఖలో పని చేయాలా సచివాలయ శాఖ పరిధిలో పనిచేయాలో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేసారు. 94 రకాల రెవిన్యూ విధులతో పాటు ఇతర డిపార్ట్మెంట్‌ల పని విఆర్‌ఒలు చేస్తున్నామని, నేడు సచివాలయాల విధులు నిర్వహిస్తూ తీవ్ర పనిఒత్తిడికి గురి అవుతున్నామని బాపూజీ ఆందోళన వ్యక్తం చేసారు. రెవిన్యూ శాఖలో హాజరు వేయాలా, లేక సచివాలయం యాప్‌లో వేయాలో నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వార్డు సచివాలయం ద్వారానే అయితే విఆర్‌ఒలకు రెవెన్యూ విధులు తొలగిస్తారా, లేక సచివాలయం హాజరునుండి మినహా ఇస్తారో తెల్పాలన్నారు. సచివాలయం సిబ్బంది ఓకే ఆశాఖ పనిచేస్తుండగా విఆర్‌ఒలతో మాత్రం అదనపు పనిచేయించుకోవడం సరైంది కాదన్నారు. అలా కాదని రెండు శాఖలు పని చేయాలి అంటే బయోమెట్రిక్ హాజరు నుండి విఆర్‌ఒలను మినహాయించాలని లేకుంటే ఈనెల 19వ తేదీన విజయవాడలో జరుగు రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## సాంప్రదాయ చేతివృత్తుల క్లస్టర్లతో భారీగా ఉపాధి : ఎంపీ మహేష్

**విశాలాంధ్ర -ఏలూరు :** గత ఐదేళ్లలో సంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి నిధి పథకం కింద దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్లస్టర్లతో చేనేత, ఇతర చేతివృత్తుల కళాకారులకు భారీగా లబ్ది చేకూరిందని కేంద్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే చెప్పారు. చేతివృత్తులకు సంబంధించిన చిన్న తరహా పరిశ్రమలు, చేనేత క్లస్టర్ల ఏర్పాటుపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు గురువారం లోక్ సభలో కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. సంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి నిధి పథకం కింద 2022 వరకూ దేశవ్యాప్తంగా 380 క్లస్టర్లకు అనుమతులు ఇవ్వగా ఇందులో 261 క్లస్టర్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, మరో 119 క్లస్టర్ల ఏర్పాటు పనులు తుది దశలో ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ క్లస్టర్ల ద్వారా మొత్తం 3,35,318 మంది చేనేత, ఇతర చేతివృత్తుల కళాకారులకు లబ్ది చేకూరిందన్నారు. వీరిలో 2,18,482 మంది పురుషులు 1,16,836 మహిళలు ఉన్నారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కు సంబంధించి వివరాలు కోరుతూ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ బాపట్ల, తూర్పు గోదావరి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, కడప జిల్లాల్లో క్లస్టర్లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ 6 జిల్లాల్లో మొత్తం 10 సాంప్రదాయ చేతివృత్తుల, చేనేత క్లస్టర్లు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

## ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జనరల్‌గా అల్లం సత్యనారాయణ

**విశాలాంధ్ర -భీమవరం:** ఎ.పి.పి.టి.డి ఎంప్లాయిస్ యూనియన్ పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కార్యదర్శి అల్లం సత్యనారాయణ ఎపి జెఎసి అమరావతి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జనరల్ గా, రీజినల్ కమిటీ నాయకురాలు పి.అరుణ, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం భీమవరంలో పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా జెఏసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్షునిగా ఐవివి సత్యనారాయణ, కోశాధికారిగా కనకారావు, మహిళా విభాగం జిల్లా చైర్మన్ గా డి.సుగుణ సంధ్య,ఆకోశాధికారిగా ఐ.గంగారత్నం ఎన్నికయ్యారు. తొలుత జరిగిన సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ హక్కుల సాధన కోసం అలుపెరుగని ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 5న వేలాది మంది సమక్షంలో జరిగే అమరావతి జెఎసి ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర నాయకులు పరి పేర్రాజు, పొన్నూరు విజయలక్ష్మీ, కోన ఆంజనేయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, పలు డిపార్ట్మెంట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పిఎంపిల 63 ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

**విశాలాంధ్ర - గణపవరం:** ది పి.ఎం. పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా గణపవరం మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పిఎంపిల అధ్యక్షుడు మండా సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన గణపవరం మండల సరిపల్లె కామాక్షి క్లినిక్ (సత్యనారాయణ గారి హాస్పటల్)లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌరవ సలహాదారులు నిడమర్తి జయసూర్య, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏఆర్‌కె పరమేశ్వర్లు మాట్లాడుతూ ఈ సంవత్సరం పి.ఎం.పి డే 63వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 27 తేదీన ఏలూరు ఆశ్రమం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ మీటింగ్ హాలులో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి సెక్రెటరీ వి శివ శ్రీనివాసరావు, ట్రెజరర్ అప్పారావు, ఈసీ సభ్యులు మస్తాన్ వలి, గణేష్ ,బాల బాలాజీ, జి. శ్రీను, పానకాలు, సభ్యులు పాల్గొన్నారు.

## మంతెనకు శుభాకాంక్షల వెల్లువ

**విశాలాంధ్ర -భీమవరం:** పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంతెన రామరాజును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో మంతెన రామరాజు నాయకత్వం కీలకమని గంటా త్రిమూర్తులు పేర్కొన్నారు.
రెండోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఆయనపై పార్టీ నాయకత్వం ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా తెలుగుదేశం పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జిల్లా స్థాయిలో పార్టీ విజయాలకు నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, టీడీపీ జిల్లా కార్యదర్శి ఐజాక్ బాబు, కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారామయ్య, ఇందుకూరి రామలింగరాజు, కోళ్ల నాగబాబు, యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, విన్నకోట వినాయక్ బాబు, పడమట సోమేశ్వరరావు, కొంద్రు శ్రీనివాసరావు, అంగర వెంకట్, యాళ్ల వెంకటేశ్వరరావు, గండి భూషణం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వ దృష్టి

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం:** విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి గిరిజన బాలికల గురుకుల పాఠశాల, ఇప్పలపాడు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, దొరమామిడి ప్రభుత్వ ఆసుపత్రి, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాసనా స్థాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి, జీసీసీ డైరెక్టర్ ఎం కన్నప్ప రాజు, కెఆర్ పురం డిప్యూటీ డైరెక్టర్ జనార్ధన్ రావు, డివైఈఓ కె. రవి ప్రసన్నకుమార్, ఏటిడబ్ల్యూఓ జనార్దన్‌రావు, శ్రీవిద్య, ఏఎంఓ కె.శిరమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి నారుమడుల్లో రైతులు సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి

**విశాలాంధ్ర-ఉండి :** వరి నారుమడులలో రైతులు సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెదపుల్లేరు, వాంద్రం గ్రామాల్లో పర్యటించి రైతులకు వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాసు వరి నారుమాడులలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురువారం వివరించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ఇప్పటివరకు 20,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి పిపిసి కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని తెలియజేశారు. ఇంకా బ్యాలెన్స్ కొనదలచిన ధాన్యానికి గాను లక్ష గోనెసంచుల వరకు 15 రైతు సేవ కేంద్రాల్లో తగినన్ని నిల్వలు ఉన్నాయని తెలియజేశారు. యూరియా విషయంలో రైతులెవరు ఆధారపడవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. యూరియా నిలవలకు సంబంధించి సొసైటీలో 100 టన్నులు , ప్రైవేటు దుకాణాల్లో 125 టన్నులు, రైతు సేవా కేంద్రంలో 25 టన్నులు వెరసి 250 టన్నుల వరకు మండలంలో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సూర్య కళ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో అభివృద్ధి

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** గిరిజన గ్రామాల అభివృద్ధికి, వారి ఎదుగుదలకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని గిరిజన కమిషన్ చైర్మన్ చోళ బుజ్జి రెడ్డి తెలిపారు. మండలంలో బిల్లిమిల్లి గ్రామానికి చెందిన ఎస్టీ కమిషన్ మెంబర్ కాకి లక్ష్మి గృహానికి విచ్చేసిన ఆయనను కాకి లక్ష్మి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో ఉన్న పలు గిరిజన పాఠశాలలను, ఆసుపత్రులను, హాస్టల్ లను తనిఖీ చేసినుట్ట తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి గిరిజనుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, గిరిజన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంద్యాల రమాదేవి, ఆకుల అరుణ, చెరుకూరి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్‌లో 'మెడ్‌పాస్' ప్రారంభం

### ఇకపై తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలు

**విశాలాంధ్ర - పాలకొల్లు:** అతి తక్కువ ఖర్చుతో "కుటుంబ ఆరోగ్యానికి మెడ్ పాస్ అందుబాటులోకి వచ్చినట్లు యునైటెడ్ హాస్పిటల్స్ బృందం తెలియజేసింది. గురువారం పాలకొల్లు పట్టణ పరిధిలోని పూలపల్లి మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపురం ఆర్డీవో దాసిరాజు హాజరై మాట్లాడారు. ప్రజలు ఆసుపత్రికి వెళ్లడానికి భయపడే ప్రధాన కారణం వైద్య ఖర్చుల భయమే అని, ఈ సమస్య కారణంగా అనేక కుటుంబాలు చిన్న ఆరోగ్య సమస్యలకైనా చికిత్సను వాయిదా వేస్తున్న పరిస్థితి ఉందని అన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ సంస్థ 'మెడ్‌పాస్' అనే కుటుంబ ఆరోగ్య మెంబర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఈరోజు నుండి ప్రారంభించడం అభినందనీయమని ఆర్డీవో దాసిరాజు అన్నారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మెడ్‌పాస్ ద్వారా ఒక కుటుంబం మొత్తం అపరిమిత ఓపీ కన్సల్టేషన్లు, డాక్టర్ సూచనతో ఉచిత డయగ్నస్టిక్, ల్యాబ్ పరీక్షలు సులభంగా పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవి వర్మ, మాట్లాడుతూ "ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా.. ఖర్చుల భయంతోనూ హాసుపత్రికి వెళ్లడం ఆలస్యం చేస్తున్నారనీ.. ఆ భయాన్ని తొలగించి, ప్రజలు ముందుగానే చికిత్స తీసుకునేలా చేయడమే మా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ డైరెక్టర్ అండ్ సీఈఓ, పి.ఎస్.కె వర్మ, మాట్లాడుతూ మా లక్ష్యం కేవలం చికిత్స చేయడమే కాదు, సమస్య రావడానికి ముందే దాన్ని గుర్తించి ఆపడం అని చెప్పారు. ప్రివెంటివ్ కేర్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే ఆరోగ్య ఖర్చులు ఎప్పటికీ తగ్గవన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డాక్టర్ ప్యానెల్ చర్చలో, అవసరం లేని పరీక్షలపై ప్రజల్లో ఉన్న అపోహలను డాక్టర్లు నివృత్తి చేస్తూ, ముందస్తు నిర్ధారణ, స్పష్టమైన వైద్య నిర్ణయాలు, మరియు ప్రివెంటివ్ కేర్ వల్ల ఆరోగ్య ఫలితాలు మెరుగవుతాయని వివరించారు. కార్యక్రమంలో కారుమూరి వెంకటా నరసింహారావు, సీతారామరాజు, హృదయ వైద్య నిపుణులు హృదయ మోహన్, న్యూరో ఫిజీషియన్ అనుపమ, జనరల్ సర్జన్ కావ్య, జనరల్ మెడిసిన్ కుసుమ, డాక్టర్ అహ్మద్, ఎమర్జెన్సీ ఫిజీషియన్స్ డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రాజు, సీఈవో కళ్యాణ్ వర్మ, డాక్టర్ అశ్విన్, సిబిఓ విజయ్, వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్స్ వంశీ, రవి కిరణ్, క్లస్టర్ మేనేజర్ గౌతమ్ రాజు, నర్సింగ్ సూపరిండెండెంట్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు లాభాలు పంచడం అభినందనీయం

### చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

**విశాలాంధ్ర కైకలూరు:** బ్యాంకులో వచ్చిన లాభాల నుండి కొంతమేర ఖాతాదారులకు పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తెలిపారు. కైకలూరు పట్టణంలోని విద్యాంజలి కాలేజి సమీపంలో శ్రీకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకు వారు ఏర్పాటుచేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొని ఖాతాదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకులో 2016- 2017 సంవత్సరం నుండి 2024-2025 వరకు ఖాతాదారులు వాడిన లావాదేవీల నుండి 38 శాతం డివిడెంట్ లాభాలను పంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్ రావు, ప్రజా ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా

**విశాలాంధ్ర - నరసాపురం :** పేదలకు సీఎం సహాయ నిధి మంచి ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు.నరసాపురం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో గురువారం పర్యటించి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల నివాసాలకు స్వయంగా వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) రూ. 7.87 లక్షలు చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కష్టకాలంలో పేదల పక్షాన ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పసలపూడి పాఠశాలలో వార్షిక తనిఖీ

**విశాలాంధ్ర-మండవల్లి:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పసలపూడిలో గురువారం మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్ సురేష్, రత్నసునందం ఆధ్వర్యంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పాఠశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, వంట నిర్వహణ తీరును పరిశీలించి తగిన సూచనలు చేశారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని కూడా పరిశీలించారు. అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.

## యువత ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

### తణుకు సీఐ నాగరాజు

**విశాలాంధ్ర- తణుకు:** ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, యువత ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తణుకు సీఐ కె. నాగరాజు అన్నారు. గురువారం స్థానిక ఎస్ కే ఎస్ డి మహిళా కళాశాలలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీ సుందరి బాయ్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ప్రయాణం చేసేటప్పుడు వేగ నియంత్రంలో ఉండాలని తెలిపారు. ఇటీవల సైబర్ నేరాలు ఆన్లైన్ మోసాలు క్రెడిట్ కార్డ్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని యువత దీనిపట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. రోడ్డు భద్రత నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రో మోడల్ ప్రాజెక్ట్ మేనేజర్ పి. విజయ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే కాళిదాసు పృథ్వీరాజ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం. నాగరాజు, యాంటీ డ్రగ్ కన్వీనర్ కె.వి రామకృష్ణ, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ కెవి శ్యామలాదేవి, సిహెచ్ రమేష్, ఎ. దీప్తి, సైకాలజిస్ట్ జి.ధన శేఖర్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## కథల పుస్తకాల పంపిణీ

**విశాలాంధ్ర - ఆగిరిపల్లి:** మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల , ఆగిరిపల్లి మెయిన్‌లో ఐదవ తరగతి చదువుతున్న వాకా సాయి శ్రీ భవాని పుట్టినరోజు సందర్భంగా వంద రూపాయల విలువగల కథల పుస్తకాలను ఆమెకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు అందించారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతి విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు ఈ విధంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 కొవ్వలి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు భీమవరపు హర్షవర్ధని, మాతంగి నీలావతమ్మ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి మత్స్యకార భరోసా

**విశాలాంధ్ర -నరసాపురం :** అర్హులైన ప్రతి ఒక్కరికి మత్స్యకార భరోసా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి మైల శివకుమార్ అన్నారు. మండలంలోని పెదమైన వానిలంక లో గురువారం నిర్వహించిన మత్స్యకార బోట్ల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పడవలు ఉండి చేపల వేట చేసే ప్రతి ఒక్కరికి మత్స్యకార భరోసా వర్తింప చేసేందుకు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల శాశ్వత గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం:** మండలం లో పర్యటించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనేంద్ర రావు తన సిబ్బందితో కలిసి డిగ్రీ కళాశాల శాశ్వత గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళాశాల నిర్మాణానికి 2018 లో కోటి రూపాయలు నిధులు మంజూరు అయినప్పటికీ మధ్యస్థంగా కళాశాల నిర్మాణం ఆగిపోయిందని, నాలుగు గ్రూపులు నిర్వహిస్తున్న కళాశాలలో సుమారు 26 గదులు కావలసి ఉండగా నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనం ఆరు గదులతో నిర్మించారని, అది కూడా మధ్యలో ఆగిపోయిందని ఎస్టీ కమిషన్ చైర్మన్ కు కళాశాల సిబ్బంది వివరించారు. ఈ మేరకు వినతి పత్రం అందుకున్న ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## టి నరసాపురం హైస్కూల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**విశాలాంధ్ర-టి నరసాపురం:** విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని విద్యాశాఖాధి కారులు టి.రామ్మూర్తి, ఎస్. కళ్యాణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు,రెండు ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్, లెక్కలకు సంబంధించిన 54 స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్ స్వామి, వివిధ పాఠశాలలకు చెందిన సైన్స్, లెక్కల ఉపాధ్యాయులు,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా నిరోధం అందరి బాధ్యత



**విశాలాంధ్ర - గణపవరం:** ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా పైన అవగాహనా కార్యక్రమం గురువారం గణపవరం మండల ప్రజా పరిషత్ పరిషత్ సమావేశ మంది రంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. బేబీ శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరం అన్నారు. ప్రతి రోజు ఎంతో మంది మహిళలు దీనికి గురి అవుతున్నా రని, ప్రతి ఒక్కరు దీని పైన అవగాహనా కలిగి ఉండాలని ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ము తున్నారన్నారని ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహనా కల్పించి రక్షించాలని అన్నారు. ఈ అక్రమ రవాణాకు లైంగిక వ్యాపారా నికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 29 సంవత్సరాలుగా పద్మ, డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 30,500 మంది మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె. శివాజీ, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు మిథాలీరాజ్, చెన్నకేశవులు, పరిపాలన అధికారి రంగ నాయకులు, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకరరెడ్డి, అనిల్ కుమార్, పంచాయతీరాజ్ మహిళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు

**విశాలాంధ్ర-చింతలపూడి:** ప్రభుత్వం టీచర్స్ ప్రొఫెషన్ లో ఒత్తిడిని తగ్గించడానికి మెన్ టీచర్స్‌కి క్రికెట్, ఉమెన్ టీచర్స్ కి త్రో బాల్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా నూజివీడు డివిజన్ పరిధిలోని 6 మండలాల్లో చింతలపూడి మండల టీం క్రికెట్ లో విన్నర్స్ గానూ, త్రోబాల్ లో రన్నర్స్ గాను ఉన్నారు వారి ని శాసన సభ్యులు రోషన్ కుమార్ అయన క్యాంపు కార్యాలయం చింతలపూడి నందు, మెడల్స్ మరియు కప్ ఇచ్చి అభినందించారు,ఏలూరు జిల్లా లో కూడా చింతలపూడికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. త్వరలోనే శాప్ చైర్మన్‌తో మాట్లాడి మరిన్ని క్రీడల్లో పోటీలు నిర్వహించబోతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రామారావు, కిరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర - గణపవరం:** గణపవరం శ్రీ చింతలపాటి వర ప్రసాదమూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి గురువారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని పీహెచ్డీ,లేదా నెట్ లేదా స్లెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు డిసెంబర్ 28 వ తేదీ లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని అన్నారు. డిసెంబర్ 30 వ తేదీన అభ్యర్థులకు ముఖాముఖీ పరీక్ష (ఇంటర్వ్యూ) నిర్వహించి ఎంపికైన వారికి అదే రోజు పోస్టింగ్ ఇస్తామన్నారు.

## చింతలపూడి మండల హిందూ సమ్మేళనం భారీ సభ

**విశాలాంధ్ర-చింతలపూడి:** ఈనెల 21వ తేదీ ఆదివారం నాడు టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు తంటపూడి ఫౌండేషన్ అధ్యక్షులు తంటేపూడి వరప్రసాద్ అన్నారు. చింతలపూడి పట్టణం ముందుగా కొత్త బస్టాండ్ వద్ద హోటల్ నుండి సభాస్థలికి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విరివిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం హిందువులందరినీ సంఘటితం చేయడం కోసమని అన్నారు. హిందువులందరూ కలిసి హిందువుల కోసం హిందువులు చేసుకునే కార్యక్రమమని తెలిపారు. సభ అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిల్లపల్లి రామమోహన్‌రావు, నిమ్మగడ్డ దుర్గారావు, చిలువూరి సురేంద్ర రాజు, సరిపూడి దుర్గా ప్రసాద్, రావిపాటి సతీష్, తంటేపూడి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారహక్కు చట్టంపై అవగాహన

**విశాలాంధ్ర - ఏలూరు:** సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడుకి ఉందని, ఆర్టీఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సిపిఓ సి. హెచ్. వాసుదేవరావు పిలుపునిచ్చారు.జిల్లా అర్థ గణాంక శాఖ ఆధ్వర్యంలో గురువారం అప్పిలేటు అధికారి సి. హెచ్.వాసుదేవ రావు, పౌర సమాచార అధికారి బి.శ్రీదేవి నేతృత్వంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. సమాచార హక్కుచట్టం గురించి తెలుసుకోవడం మీ హక్కు చెప్పడం ప్రభుత్వ భాధ్యత అనే నినాదంతో ఏలూరు శాఖ కార్యాలయం నుండి మోర్ సూపర్ మార్కెటు, జడ్పీ కార్యాలయం మీదుగా పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ ప్రజలకు ఆర్టీఐ వారోత్సవాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అర్థ గణాంక అప్పీలేటు అధికారి సి. హెచ్. వాసుదేవ రావు, పిఆర్ వో బి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించి, ప్రభుత్వ కార్యకలాపాలలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే దిశగా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, అధికారులు జవాబుదారీతనాన్ని పెంచడం అవినీతిని నిర్మూలించడం ఈ చట్టం యొక్క ముఖ్యఉద్దేశ్యమని అన్నారు. సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడుకి ఈ చట్టం హక్కు కల్పిస్తుందని అన్నారు. సమాచార హక్కు చట్టం పౌరుల సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో ఉప గణాంక అధికారులు, సహాయక గణాంక అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది, విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది, ఏడబ్ల్యాయస్ సిబ్బంది, డేటా ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర యువజన కార్యదర్శిగా పవన్ కుమార్ శర్మ

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర యువజన కార్యదర్శిగా యామిజాల కృష్ణ పవన్ కుమార్ శర్మ (భీమవరం పండితులు) నియమితులయ్యారు. కొవ్వూరు లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్యలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పవన్ కుమార్ శర్మ గురువారం భీమవరంలో ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సమాఖ్య సభ్యులకు వెన్నుదన్నుగా ఉంటూ సమాఖ్య బలోపేతానికి అంకితభావంతో సేవా చేస్తానని పవన్ కుమార్ శర్మ అన్నారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం జరుగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపకులు యామిజాల నరసింహ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి తెన్నేటి సునీల్ కుమార్, రాష్ట్ర యువజన అధ్యక్షులు శిష్ట మణికంత తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర యువజన కార్యదర్శిగా నియమితులైన పవన్ కుమార్ ను భీమవరంలోని బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు, పురోహితులు అభినందనలు తెలిపారు.

## తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వండి

**విశాలాంధ్ర- ఉంగుటూరు :** గ్రామాల్లో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను తడి చెత్త పొడి చెత్త కింద వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని తద్వారా వీధులను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్ అన్నారు. గురువారం ఉంగుటూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొన్ని వీధులలో పర్యటించి ఆ ప్రాంతంలోని మహిళలకు పొడి చెత్త తడి చెత్త ఏ విధంగా వేరు చేసి ఇవ్వాలో పారిశుధ్య కార్మికుల చేత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైన్ లలో చెత్త వేసే అలవాట్లు మానుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి పంచాయతీ వారికి సహకరించాలని, డోర్ టు డోర్ చెత్త సేకరణకి పారిశుధ్య కార్మికులు వచ్చే సరికు చెత్తను తడి చెత్త పొడిగా వేరుచేసి ఇవ్వాలన్నారు. అనంతరం పలు వీధుల్లో పర్యటించి డ్రైనేజీ సమస్యల్ని త్వరలో పరిష్కరించనున్నట్టు ప్రజలకు ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిపిఆర్సి మేనేజర్ ప్రసంగి రాజు, సూర్య కుమార్ ఉంగుటూరు పంచాయతీ కార్యదర్శి బొడ్డు రవిచంద్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్నకు భారీ ఆదాయం

### హుండీల లెక్కింపులో 28 రోజులకు రూ.1.56 కోట్ల ఆదాయం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా మొత్తం రూ.1,28,07,874 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.28,23,211 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మొత్తంగా 28 రోజుల కాలానికి గాను రూ.1,56,31,085 ఆదాయం లభించిందని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పేర్కొన్నారు. నగదు రూపంలోనే కాకుండా భక్తులు సమర్పించిన కానుకలుగా 27 గ్రాముల బంగారం, 1 కిలో 150 గ్రాముల వెండి కూడా లభించినట్లు తెలిపారు. అంతేకాకుండా 10 దేశాలకు చెందిన 43 విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీలలో లభించినట్లు ఆయన వివరించారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎంకెటిఎస్‌వి ప్రసాద్ వ్యవహరించగా, తనిఖీదారులుగా ఎస్‌టీపీటీ శ్రీనివాస్, రాజమండ్రి ఈవో ఎం సత్యనారాయణ (వెలిచేరు గ్రూప్ శ్రీ దేవాలయాలు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు, గ్రామస్తులు, పత్రికా ప్రతినిధులు, శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొని హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికల టాయిలెట్ భవనం ప్రారంభం

విశాలాంధ్ర - రావులపాలెం : అంబేద్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బాలికల టాయిలెట్ భవనం ప్రారంభోత్సవాన్ని స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినిలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం ఎంపిసి విద్యార్థిని వి తేజశ్రీ మాట్లాడుతూ అన్ని వసతులతో అత్యంత ఆధునికంగా ఈ టాయిలెట్ భవనం నిర్మించారని, దీని వల్ల విద్యార్థినిలందరికీ ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ వ్యాఖ్యలకు విద్యార్థినిలు, విద్యార్థులు చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. అనంతరం కళాశాలలో ఉచితంగా పంపిణీ చేస్తున్న టెక్స్ట్ బుక్స్, రికార్డులు, అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న తీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కళాశాలకు త్వరలోనే ప్రహరీ గోడ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్తి వెంకట సూర్యనారాయణ రెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. కోనసీమ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ సీనియర్ నాయకులు గుర్తుల పట్టాభి రామారావు, కొప్పిశెట్టి ప్రసాద్, తోట లక్ష్మణ, సాగర్, పసుపులేటి రాధాకృష్ణ, జక్కంపూడి బాలాజీ, సాధనల శ్రీనివాసు, మహిళా నాయకురాలు దుర్గ, కోట రమణి, కళాశాల అభివృద్ధి కమిటీ కార్య దర్శి కొవ్వూలి నరిష్ కుమార్ రెడ్డి, కమిటీ సభ్యులు జక్కంపూడి రామకృష్ణ, కొవ్వూరి వెంకటరెడ్డి, పడాల బుల్లి కొండ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యా ర్థినిలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. కనికిరెడ్డి ఎమ్మెల్యేకు పూలమాల సమర్పించారు. కాంట్రాక్టర్ సురేష్ను ఎమ్మెల్యే, ప్రిన్సిపల్, అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఘనంగా మండల విజ్ఞాన ప్రదర్శన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలంలోని మహాత్మా గాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఘనంగా నిర్వహించబడింది. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారులు పి వరప్రసాదరావు, సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంజి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మరియు సెక్రటరీ పిఎస్ రాజు మాట్లాడుతూ, విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఏడు థీమ్‌లలో ప్రదర్శించిన 65 ప్రాజెక్టులు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో సుమారు 100 మంది విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మండల స్థాయిలో ఏడు థీమ్‌లలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎస్‌విఎస్ఎస్ ప్రసాద్, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది రాంబాబు, బాబీ, సీఆర్ఎంటీలు సుధాకర్, ఆత్మారావు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర - కరప : కరప మండలం అరట్లకట్ట జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రధానోపాధ్యాయులు శ్రీని వాస్ కుమార్ అధ్యక్షతన నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ కేబి కృష్ణవేణి, పి సత్యనారాయణ పాల్గొ న్నారు. ఇందులో 13 పాఠశాలల నుండి ఏడు విభాగాలలో 84 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక విజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో సైన్స్ ఫెయిర్ వలన విద్యార్థుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేందుకు సైన్స్ ఫెయిర్ విద్యార్థులు ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు వేదిక -'థండర్ థర్స్‌డే'

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం అదిత్య విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (రాజా) ఆధ్వర్యంలో, అభినయ క్లబ్ నిర్వహిస్తున్న 'థండర్ థర్స్‌డే' విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోంది అని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రతి వారం నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక వ్యక్తీకరణ వేడుకలా మారింది. థండర్ థర్స్‌డే వేదికపై విద్యార్థులు పాటలు, నృత్యం, నాటకం, కవిత్వం, కథనాలు, మిమిక్రీ, స్టాండ్-అప్ కామెడీ, యాంకరింగ్, కళలు లేదా తాము కలిగిన ఏదైనా ప్రత్యేక ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించవచ్చు. "ప్రతిభకు పరిమితులు ఉండవు" అన్న ఆలోచనతో ఈ వేదిక విద్యార్థులను ముందుకు నడిపిస్తుంది. ఈ కార్యక్రమం విద్యార్థులలో స్టేజ్ భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ విభాగాలు, సంవత్సరాల విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా స్నేహభావం, సమన్వయం, సాంస్కృతిక వైవిధ్యం పెరుగుతుంది. అభినయ క్లబ్ ఈ కార్యక్రమాన్ని అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తోంది. ఈ క్లబ్ క్లబ్ కోఆర్డినేటర్ డా నీలిమ సమర్థవంతమైన నాయకత్వంలో పనిచేస్తుంది. ఆమె దృష్టి విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై కేంద్రీకృతమై ఉండటంతో, థండర్ థర్స్‌డే ఒక సాధారణ కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల స్వరానికి ప్రతీకగా మారింది. థండర్ థర్స్‌డే ప్రతి గురువారం క్యాంపస్‌ను ఉత్సాహంతో నింపుతూ, విద్యార్థుల జీవితాల్లో చిరస్మరణీయ అనుభవాలను అందిస్తోంది. ఈ వారం విదేశీ విద్యార్థుల నృత్యాలు ఎంతగానో విద్యార్థులను ఉర్రూతలూగించాయి. శాంటా క్లాస్ వేషధారణతో విద్యార్థుల విచిత్ర వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సంధర్భంగా డా ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాల ద్వారా ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సాంస్కృతిక కళా రంగాల్లో కూడా ప్రాధాన్యం ఇస్తోంది అనే విషయాన్ని మరోసారి నిరూపిస్తోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డా డి కిషోర్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ పరంజీత్ సింగ్, సౌత్ కొరియా ప్రతినిధి డా యూ టాక్ లీ, తదితరులు పాల్గొన్నారు.

## 20న ప్రతి గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఈ నెల 20న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 3వ శనివారం, డిసెంబర్ 20న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల "పర్యావరణంలో అవకాశాలు" -స్వయం ఉపాధి, వ్యవస్థాపకత పర్యావరణ రంగాలలో అవకాశాలు అనే థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా అంతట నిర్వహించాలని ఆయన ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం సంబంధించి ముందు రోజు శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం, మైక్ అనౌన్స్మెంట్‌లు ద్వారా ప్రచారం చేయించి, శనివారం రోజున ఏ జరిగే కార్యక్రమాల ప్రదేశాల వివరాలు ప్రజలందరూ అందరికీ తెలిసేలా చేయాల న్నారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో శుభ్రపరచడం చేయాలని, వేస్టుకు సంబంధించిన వస్తువులను సేకరించి ఒక చోట ఉంచాలన్నారు. అన్ని మేజర్ మరియు హెడ్ క్వార్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సంస్థలు మరియు ప్రజల నుండి వేస్టును సేకరించాలన్నారు.

పర్యావరణంలో అవకాశాలు" -స్వయం ఉపాధి మరియు వ్యవస్థాపకత పర్యావరణ రంగాలలో అవకాశాలు అనే థీమ్ పోస్టర్‌లను జన సమర్థం గల ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంస్థలు ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పెంచుకోవడమే కాకుండా తమ బాధ్యతగా స్వీకరించి ప్రజల ఆరోగ్యం, పర్యా వరణ పరిరక్షణకై కృషి చేయవలెను. వెస్టు వల్ల ఆరోగ్యం, పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. వెస్ట్‌కు సంబంధించిన ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి గ్రామపంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర డిసెంబర్ నెల థీమ్ పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలన్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ఈనెల 20వ తేదీన జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా పర్యా వరణానికి, ప్రజలకు కలిగే మేలు పై ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టే ఈ కార్యక్రమాలను ఆన్ లైన్‌లో పొందు పరచాలన్నారు. వారు నిర్వహించే కార్యక్ర మాలకు ఫోటోలు తీసి స్వచ్ఛాంధ్ర వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాలపై రాష్ట్రస్థాయిలోనూ పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. శ్రద్ధతో నిక్కచ్చిగా కార్యక్రమాలు నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు.

## తెలుగు రాష్ట్రాలలో బీసీలకే డిప్యూటీ సీఎం పదవిని ఇవ్వాలి

### సీనియర్ నటుడు సుమన్

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ కులాల అభ్యున్నతికి ప్రభుత్వాలు పనిచేయాలని వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో రిజర్వేషన్ కల్పించడంతో పాటుగా ఉభయ తెలుగు రాష్ట్రలలో బీసీ కులాలకే డిప్యూటీ సీఎం పదవిని కేటాయించాలని సీనియర్ సిని నటుడు సుమన్ పేర్కొన్నారు. కాకినాడలోని వీర కమల్ థియేటర్ ప్రాంగణంలో రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో సంకల్ప సభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన సుమన్కు రాష్ట్ర బబీసీ సంఘం నాయకులు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి అధ్యక్షత వహించగా సుమన్ ముఖ్య అతిథిగాను, రాష్ట్ర బీసీ సంఘం ప్రెసిడెంట్ శొంటి నాగరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో బాబాసాహెబ్ అంబేద్కర్ బీసీ కులాలకు రిజర్వేషన్ కల్పించిన స్వాతంత్రం వచ్చి 78 గడుస్తున్నా కొన్ని కులాలకు రాజ్యాధికారం దక్కలేదని అటువంటి కులాలను గుర్తించి వారికి రాజకీయ ప్రాదాన్యతను కల్పించేం దుకు అన్ని రాజకీయపార్టీలు కృషి చేయాల న్నారు. ఉభయ తెలుగు రాష్ట్రలలో బీసీల్లో అభ్యున్నతికి డిప్యూటీ సీఎం పదివిని ఇవ్వాలని కోరారు. రాష్ట్ర సంఘం ప్రెసిడెంట్ శొంటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలను కలుపుకుని కులాలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ దక్కే విదంగా కృషి చేస్తానన్నారు. అనంతరం యనమదల రవి, శొంటి నాగరాజు, సంఘం నాయకులు సుమన్కి సాలువాలు కప్పి భారీ గజ మాలలు వేసి ఘనంగా సత్కరించి బీసీ రత్న అవార్డును ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కర్రి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకే రాజు, సర్పవరం గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు చిన్నా, కొండా వినాయక్, ఆవుపాటి ఉమాశంకర్, అనసూరి సతీష్, శివాజీ, బీసీ నాయకులు పెంకే వెంకటలక్ష్మీ, అనసూరి రాజకుమారి, శాంతి, కోటా నాగలక్ష్మీ, పెంకే శివప్రసాద్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యకుమార్ కాకినాడ జిల్లా అధ్యక్షులు విస్సకోట వెంకటేష్, గౌరవ అధ్యక్షులు కొమ్మన తాతారావు, పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను సందర్శించిన ఇన్‌చార్జ్ కమిషనర్ సత్యనారాయణ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారిందని నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ పేర్కొన్నారు. ఐదు రూపాయలకే నాణ్యమైన, హైజానిక్, రుచికరమైన ఆహారం అందించడం అన్న క్యాంటీన్ ప్రత్యేకత అని ఆయన అన్నారు. గురువారం కాకినాడ నగరంలోని రాజా ట్యాంక్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కమిష నర్ కేటీ సుధాకర్‌తో పాటు ఇతర అధి కారులతో కలిసి క్యాంటీన్‌కు వచ్చిన పేద ప్రజలతో కలిసి అల్పాహారాన్ని స్వీకరిం చారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, సేవలపై ప్రజల అభిప్రాయాలను కమిషనర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకుంటూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సూచనలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్న క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం పూర్తిగా హైజానిక్‌గా, రుచికరంగా ఉండటంతో పాటు పేద ప్రజలకు తృప్తికరంగా ఉందన్నారు. క్యాంటీన్‌ను వినియోగిస్తున్న పేద ప్రజలు కూడా తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ, అతి తక్కువ ధరకు కడుపునిండా భోజనం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్‌తో పాటు నగరపాలక సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అగ్నికుల క్షత్రియులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర - రావులపాలెం : తెలుగుదేశం ఆవిర్భావం నుంచి అగ్నికుల క్షత్రియులకు, పార్టీకి అవినాభావ సంబంధం ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో జిల్లా అగ్నికుల క్షత్రియ నాయకులు ఎమ్మెల్యేని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు తెదేపా ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. వాడపల్లి ఆలయం వద్ద పినపోతు గజేంద్రుడు విగ్రహ ఏర్పాటు జరుగుతుందన్నారు. దేవస్థానం పాలకమండలిలో అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మసకపల్లి త్రిమూర్తులును ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వాడపల్లి ఆలయ పాలకమండలిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సభ్యులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. దానితో హెూంమంత్రి అనిత సూచించిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అప్పల నరసకు స్థానం లభించిందని తెలిపారు. వాడపల్లి దేవాలయాన్ని నిర్మించిన పినపోతు గజేంద్రుడు మన నియోజకవర్గంలోని అగ్నికుల క్షత్రియులు కావడంతో మన నియోజకవర్గంలో సైతం ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత దక్కాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకి తెలియజేయడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారని, వెంటనే మసకపల్లి త్రిమూర్తులుకు పాలక మండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానం కల్పిస్తూ జీవో ఇవ్వడం జరిగిందన్నారు. మొంథా తుఫాను సమయంలో సైతం జిల్లాలో 28వేల మందికి 50 కేజీల బియ్యం 6 రకాల నిత్యవసర సరుకులను అందజేశారని తెలిపారు. వేట నిషేధం సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం సైతం రూ.20వేలకు పెంచడం జరిగిందన్నారు. అంతర్వేది ఆలయానికి సంబంధించిన అంశాన్ని సైతం దేవాదాయ శాఖ మంత్రి వాడపల్లిలో పర్యటించినప్పుడు ఆయన దృష్టికి తీసుకువెళ్లామని అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గ నేతలతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, పాలూరి సత్యానందం మరియు అగ్నికుల క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.

## టి రాయవరంలో రైతులకు యూరియా కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి జె అమృత ఆధ్వర్యంలో యూరియా కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభ రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో రైతులు వ్యవసాయంపై ఎక్కువ ఆధారపడతారని లాభసాటిగా మార్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తాను అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో అసెంబ్లీలో వ్యవ సాయం, సాగునీటి ప్రాజెక్టులపై చర్చిం చడం జరిగిందన్నారు. అలాగే ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతు లకు అవసరమైన ఎరువులు సమస్యలు లేకుండా అందించేందుకు యూరియా కార్డులు పంపిణీ చేస్తారని ఎకరాకు విడతల వారీగా 3.5 బస్తాలు పంపిణీ చేస్తారన్నారు. సర్వే తోటలు పండించే రైతులకు యూరియా సరఫరా పై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని దాని ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ జి శ్రీనివాస్, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డ్ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, సర్పంచ్ సుబ్బారావు, అమరాది వెంకట్రావు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాట్రేనికోనలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర - కాట్రేనికోన : విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఎంతగానో దోహద పడతాయని కాట్రేనికోన మండల విద్యాశాఖ అధికారులు ఎస్ కృష్ణమోహన్, ఎం వెంకటరమణలు అన్నారు. గురువారం కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలో గల అన్ని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని వివిధ సైన్సు విజ్ఞాన ప్రదర్శనలు చేశారు. ఈ పోటీలలో ఏడు టీములు పాల్గొనగా పి లక్ష్మివాడ ఉన్నత పాఠశాల నుండి 3, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు చెయ్యేరు, కాట్రేనికోన, దొంతికుర్రు, వేట్లపాలెం నుండి ఒక టీము చొప్పున విజయం సాధించారు. జిల్లా స్థాయి పోటీలకు గాను సోమవారం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారు. ఈ కార్యక్రమములో మండల విద్యాశాఖాధికారులు, హైస్కూల్ హెచ్ఎం ఆర్ అంబ న్యాయ నిర్ణతలుగా వ్యవహరించారు.

## యుటీఎఫ్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం తాటిపర్తి హైస్కూల్ మరియు వన్నెపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నవిద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో సుమారు 140 మంది విద్యార్థులకు ఎస్ఎస్సి మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహాయం చేసినటువంటి దాతలు కార్తికేయ హాస్పిటల్ పిఠాపురం డాక్టర్ మొగలి కాశీ విశ్వనాథం మరియు శ్రీ అపర్ణ సేవా ట్రస్ట్ తాటిపర్తి సభ్యులు కలిసి సంయుక్తంగా విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ నాగమణి, వన్నెపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, కార్తికేయ హాస్పిటల్, పిఠాపురం డాక్టర్ మొగలి కాశీ విశ్వనాథం, వారి తండ్రి సాంబశివరావు, శ్రీ అపర్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, తుమ్మూరి శ్రీరామారావు, ఆకొండి ప్రభాకర శాస్త్రి, గ్రంధి రమేష్, యుటిఎఫ్ నాయకులు జిఎస్ఎన్ మూర్తి, వివి శంకర్, దాసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మండల విద్యాశాఖ అధికారి పి పుల్లయ్య ఆధ్వర్యంలో గురువారం స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. సామర్లకోట మండలంలోని ఆరు కాంప్లెక్స్ ఉన్నాయని కాంప్లెక్స్ వైజ్ కాంప్లెక్స్‌లోని స్కూల్స్‌కి ఆట వస్తువులను ఇవ్వడం జరిగినది. 6 కాంప్లెక్స్‌ను కలిపి సుమారు 1400 వరకు స్పోర్ట్స్ ఐటమ్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సీఆర్పీలు ద్వారా అందజేశారని అని ఎంఈఓ పి పుల్లయ్య తెలియజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని పెంచేందుకు మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆలోచించి ప్రభుత్వం ఐజంపు పోల్స్, బ్యాడ్మింటన్ కార్డ్స్, బ్యాడ్మింటన్ సర్కిల్ రాకెట్స్, క్యారం బోర్డ్ సెట్, చెస్ సెట్, ఉడెన్ క్రికెట్ బ్యాట్స్, ఫైబర్ క్రికెట్ బ్యాట్స్, ప్లాస్టిక్ స్టెప్స్ సెట్, సాఫ్ట్ టెన్నిస్ బాల్స్, వుడెన్ స్టెమ్స్ సెట్, ఫుట్బాల్ పంపు, హ్యాండ్ బాల్స్, వెయిటింగ్ మిషన్, స్టిప్పింగ్ రూప్స్, టేబుల్ టెన్నిస్, టేబుల్ ఫర్ టేబుల్ టెన్నిస్ రింగ్స్, త్రో బాల్స్, వాలీ బాల్స్, యోగ మాక్స్ మొదలగు రకముల ఆట వస్తువులను అందజేసింది అని తెలియజేశారు.

## చిన్నారి మెదడులు భవిష్యత్ ఆవిష్కరణలకు నెలవులు

విశాలాంధ్ర - రామచంద్రపురం : రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారులు డేవిడ్ మరియు జాన్‌లు అధ్యక్షతన మండలంలో గల విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షులు భారతీ మురళీకృష్ణ, ఎంపీడీవో జె రాంబాబులు విచ్చేశారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలు విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందింజేస్తాయన్నారు. మండల విద్యా శాఖాధికారి డేవిడ్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను తట్టి లేపడానికి ఈ ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశ నుండే శాస్త్రీయ వైఖరులు పెంపొందించుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనలో విజేతలయైన కాజులూరు హైస్కూల్ లలితాదిత్య, నిత్య ప్రియ వర్షిత, కుసుమ దుర్గ, వట్టూరి చిన్నారి, శ్రీకోటి స్కూల్ దివ్య, పల్లిపాలెం హైస్కూల్ విజయ్ కుమార్, జగన్నాథ గిరి హైస్కూల్ శశి సత్యసుధలు జిల్లా స్థాయిలో కాకినాడలో జరిగే సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనవలసి ఉంది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మలత, ప్రధానోపాధ్యాయులు ఎం విష్ణుమూర్తి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, కాజులూరు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశేషంగా లక్ష పత్రి పూజ

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ల గ్రామంలో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి మార్గశిర మాస శివరాత్రి మహాపర్వదినం పురస్కరించుకుని, లక్ష పత్రిపూజ గురువారం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకులు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం బిల్వార్చన కార్యక్రమం జరిపారు. ప్రతి మాసశివరాత్రికి ఆలయంలో భక్తుల గోత్రణామాలతో దేవస్థానం తరపున లక్ష పత్రి పూజ జరుపుతారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి వి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.